# జ్ఞాపకాలజావళి

పొత్తూరి విజయలక్ష్మి



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
కౌముది ప్రచురణలు - 135

# జ్ఞాపకాల జావళి

## (2012 01 – 2012 12)

## విషయసూచిక


| ఏడాది | నెల | పేరు | పేజీ |
|---|---|---|---|
| 2012 | 01 | ప్రారంభం | 02 |
| | 02 | అప్పడాల సందడి | 07 |
| | 03 | మా  సమ్మర్ క్యాంపు | 10 |
| | 04 | జాగర్త అది వింటుంది | 12 |
| | 05 | అసలు రహస్యం | 15 |
| | 06 | పోస్ట్ చేసిన ఉత్తరం | 18 |
| | 07 | బొమ్మలపెళ్ళి | 20 |
| | 08 | భ్రమరాంబ అక్కయ్య | 22 |
| | 09 | అరిసెల కథ | 24 |
| | 10 | పట్టుచీర పూలబుట్టా | 26 |
| | 11 | మా ఇంట్లో కాఫీ ప్రహసనం | 28 |
| | 12 | కదంబం - పుణుకులూ | 30 |


KOUMUDI



# జ్ఞాపకాల జావళి

## - పొత్తూరి విజయలక్ష్మి



నా చిన్న తనం మా తాత గారిది కుగ్రామం .రెండు బ్రాహ్మణ వీధులు ..వూరి మధ్యన ఒకే ఆవరణలో విష్ణాలయం, శివాలయం, ఆంజనేయస్వామి ఆలయం. హైస్కూలు, ఎలిమెంటరీ స్కూలు, పోష్టాఫీసు అనబడే ఆత్మా రాముడు గారి వరండా. మరికాస్త లోపలికి వెళ్తే లైబ్రరీ మరియూ రామభజన మండపం. గుళ్ళకి ఎదురుగా గ్రామదేవత పుట్టలమ్మ ఆలయం. ఇంకాస్త అటుగా వెళ్తే మంచినీళ్ళ బావి అదీ దాటాక మల్లె తోటలూ ,జీడి మావిడి తోటలు, నారు మళ్ళూ , వరి పొలాలు, తాటి తోపులు, బిడారు దిబ్బలు అని పేరుపడ్డ పెద్ద ఇసుక దిబ్బలు. అవి దాటాక ఈ కుగ్రామాన్ని బాహ్య ప్రపంచంతో కలిపే తారు రోడ్డు ఇదీ ఆ గ్రామ స్వరూపం. వూరిపేరు యాజలి.

అందరూ కలిసి కట్టుగా వుండేవాళ్ళు. కులాల అంతరాలు అంతస్తుల తేడాలు ఉండేవికాదు. వూళ్ళో సుబ్బారావు కిరాణాకొట్టు , సామ్రాజ్యమ్మ కాఫీ హోటలు ఉండేవి . హోమియో డాక్టరు శేషగిరి రావు గారు ఇంగ్లీషు మందులిచ్చే కంపౌండర్‌గారు వుండేవారు. మేళం వాయించడానికి సుబ్బారాయుడు ఉండేవాడు. రెండు టైరు బళ్ళు, ఒక పల్లకి ఉండేవి. మంచినీళ్ళు పోసే భ్రమరాంబగారు వుండేది .రేడియో అక్కయ్య లాగా వూరందరికీ అక్కయ్యే ఆవిడ. ఆవిడకి ఓ చెల్లెలు సీతారావమ్మ. ఆవిడ భర్త సీతారామయ్య. వాళ్ళిద్దరూ వూరికి కొండంత అండ. ఏపని చెప్పినా కాదనకుండా చేసేవాళ్ళు నిజానికి పాపం వాళ్ళకి ఏ పన్లూరావు . ఊరిమీద ఆధారపడి బతుకుతున్నారు కాబట్టి కాదనకుండా వాళ్ళకి చాతయినట్లు చేసి పడేసేవాళ్ళు. ఆ తరవాత వారిదయ ఎదటివారి ప్రాప్తం. మంత్రాలు వేసి తాయెత్తులు కట్టే దిబ్బమీది బసవడు. మంత్రసాని మంగ వుండేవాళ్ళు . చాటింపు వేసే లక్ష్మడు. వీధి దీపాలు వెలిగించే దరియా వుండేవాళ్ళు. పౌరోహిత్యం చేయించే శాస్తుర్లుగారు, రంగయ్యగారూ వుండేవారు. ఇవీ స్థూలంగా ఆ వూరి మనుషుల వివరాలు. తెల్లవారుజామునే వూరు నిద్ర లేచేది . ఎవరి పనులు వాళ్ళు చేసుకుంటూ పోయేవాళ్ళు. ఎక్కడ , ఎప్పుడు ఎవరు ఎదురైనా ఎన్నో ఏళ్ళ తరువాత కలుసుకున్నవాళ్ళలాగా కరువు తీరా కబుర్లు చెప్పుకునే వాళ్ళు. దాపరికాలు ఉండేవి కాదు. కష్టసుఖాలు ఒకరికొకరు పంచుకునేవాళ్ళు.

ఆ వూరికి కరణం మా తాతగారు. ఉప కరణం ఆయన తమ్ముడు. అనగా మాచిన్న తాతగారు. వూరి పెత్తనం అంతా వారిదే వారి మాట వేదవాక్కు.శిలాశాసనం వారు ఓ పని చెపితే అదీ సుగ్రీవాజ్ఞ. మా అమ్మమ్మ, చిన్న అమ్మమ్మ అధికారం లేక పోయినా బోలెడంత ప్రాముఖ్యం వున్న వాళ్ళు. పగలంతా పనులూ కాలక్షేపం. సాయంత్రం గూట్లో దీపం నోట్లో ముద్ద..అన్నట్లు పెందలాడే భోజనాలు ముగించేసి కాసేపు కబుర్లు. మాధవ కబళం వాళ్ళు వచ్చి మిగులు తగులు పట్టుకుపోవటంతో ఆవేళ్టి పనులు ముగిసినట్టే

ఇక అందరూ పక్కలు ఎక్కేవాళ్ళు. గడియారం ప్రకారం అప్పటికీ ఎనిమిది కూడా అయ్యేది కాదు. కబుర్లు చెప్పుకుంటూ నిద్రపోయేవాళ్ళు.

ఇళ్ళల్లో సామాన్లు కూడా మితంగానే ఉండేవి నవారు మంచాలు, చాపలు పరుపులు పక్క బట్టలు పాత్ర సామాన్లు రెండు ట్రంకు పెట్టెలు ప్రతి వారి ఇంట్లోను ఉండేవి . మరికొన్ని సామాన్లు కలిగిన వారి ఇళ్ళల్లో మాత్రమే ఉండేవి. పందిరి మంచం, గోడ గడియారం, పడక్కుర్చీ గోడకి తగిలించే నిలువుటద్దం పెట్రోమాక్స్ లైటు గ్రాంఫోను ఇవన్ని గొప్ప స్టేటస్ సింబల్స్. ఎవరింటికైనా వియ్యాలవారో అల్లుడో వస్తే ఈ వస్తువులు అరువు అడిగి పట్టుకెళ్ళటం ఆనవాయితీ. సీదా సాదాగా ఐకమత్యంగా ఆనందంగా అమాయకంగా జీవనం సాగించే ఆ వూళ్ళో అనేకానేక మైన అనుభవాలు సంఘటనలు అవన్నీ ముందు ముందు ముచ్చటించుకుందాం. కనుమరుగు అయిపోయిన ఆ రోజులను మళ్ళీ గుర్తుచేసుకుందాం. ఆ మధురానుభూతులను మనసారా ఆస్వాదిద్దాం.

## (ప్రారంభం)

వంటింటి గుమ్మం దగ్గర నిలబడి తులసికోట వంక తేరిపార చూసింది అమ్మమ్మ. రమారమీ వొంటిగంట అయి వుంటుంది అంది. నీడ చూసి టైము చెపుతుంది అమ్మమ్మ. అమ్మో ఆవిడ టైం చెప్పిందంటే ఓ పదినిముషాలు ఇటూ అటూ అంతే. అంతకు మించి తేడా రాదు అని నాన్నగారు తెగ మెచ్చుకుంటారు.

'మరి నేను అలా వెళ్ళొస్తాను. ఇవ్వాళ రంగడు వస్తాడుగా' అంటూ ఉత్తరీయం భుజాన వేసుకుని చెప్పులు వేసుకుని బయలుదేరారు తాతయ్య. మెట్లు దిగి రోడ్డు మీదికి వెళ్ళారో లేదో 'బావా మాష్టారి ఇంటికేనా? మావయ్యా అక్కడికేనా?' అంటూ మరో నలుగురు ఇళ్ళల్లోంచీ బయటికి వచ్చారు. అందరూ నడుచుకుంటూ పశుపతి గారింటికి చేరారు. అప్పటికే పశుపతిగారు చాప పరుచుకుని ఎదురుగా బల్ల పెట్టుకుని కూర్చున్నారు. అక్కడ మరో నలుగురు చేరి పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నారు. వీళ్ళని చూడగానే బోలెడంత సంతోషం పడిపోయారు. అరుగు నిండిపోయింది కబుర్లు సాగిపోతున్నాయి

ఆ అరుగే మావూరి పోష్టాఫీసు అరుగు మీద స్తంభానికి యెర్ర రంగు పోస్టు డబ్బా ఇనప తీగలతో బంధించబడి వుంటుంది. అరుగు మీద చాప దానిమీద రాతబల్ల. ఆ బల్ల సొరుగులో ఇన్‌లాండ్ కవర్లు, కార్డులు, స్టాంపులు వగైరా సరంజామా వుంటుంది

యాజలి పోస్టు వయా కర్లపాలెం, బాపట్ల తాలూకా, గుంటూరు జిల్లా అని అడ్రసు కల ఉత్తరాలు అక్కడికే వస్తాయి

ఆ కుగ్రామం నుండి ఎక్కువ జాబుల రాకాపోకా వుండదు కాబట్టి వారానికి రెండు సార్లు మాత్రమే తపాలా బంట్రోతు వస్తాడు మావూళ్ళోకి. ఉత్తరాలు అందించి, పోస్టు డబ్బాలో పడ్డ వుత్తరాలు తీసుకుని వెళ్ళిపోతాడు. అతని పేరు రంగడు. మంగళవారం, శుక్రవారం వస్తాడు

KOUMUDI

ఆ రెండు రోజులూ గొప్ప సందడిగా వుంటుంది వూళ్ళో. ఆ సందడి చెప్పతరం కాదు చూసి ఆనందించాల్సిందే

ఆవేళా అందరూ అరుగు మీదికి చేరారు. అందరి చూపూ రోడ్డుమీదే ఇంకా రాడేం? బస్సు మీదగానీ వస్తున్నాడా? అదీ దైవాధీనం వ్యవహారం అనుకుంటున్నారు. అంతలో దూరాన సైకిలు బెల్లు వేణు గానంలాగా వినిపించింది. అంతదూరాన కనిపించింది రంగడి సైకిలు. అదుగో అదుగో వచ్చేసాడు అంటూ ఆనంద పడ్డారు అందరూ.. ఆ సందడికి లోపల్నించీ వచ్చింది పశుపతి గారి భార్య గుమ్మం దగ్గరే ఆగి తల బయటపెట్టి 'ఎండన పడి వస్తాడు. వాడిని కాస్త కుదుట పడి గుప్పెడు తిననివ్వండి' అని హెచ్చరించింది .

రంగడు సైకిలు దిగి లోపలి వచ్చాడు. చేతులో సంచీ అరుగుమీద పెట్టాడు. అంటే పోస్టు మాష్టారు కంటే ముందుగానే మరెవరో చొరవగా సంచీ విప్పేసారు.

లోపల రెండు కార్డులు, ఒక ఇన్‌లాండ్ కవరు వున్నాయి. ముందుగా కార్డులు తీసారు, సీనయ్యగారికి ఒకటి సోమయ్యకి ఒకటి. కవరేమో సుందరం మాష్టారికే అంటూ పైకే గట్టిగా చెప్పేశారు. నిరక్షరాస్యులు అలాగా అని కుతూహలంగా చూసారు. ఒక మనిషి లేచి ఆ నలుగురికీ ఆ విషయం చెప్పడానికి పరుగెత్తాడు

కళ్ళజోడు సవరించుకుని సేనయ్యగారి కార్డు అందుకున్నారు పోస్టు మాష్టారు. అందరూ చెవులప్పగించారు. **మహారాజశ్రీ మామగారికి మీ అల్లుడు నరసింహం నమస్కరించి వ్రాయునది.** ఇచ్చట అందరం క్షేమముగానే ఉన్నాము. మహాలక్ష్మి సమానురాలగు మా అత్తగారు క్షేమమే అని తలుస్తాను. ఇటీవల గంగా భాగీరథీ సమానురాలగు మా తల్లి గారికి సుస్తీ చేసినది. జ్వరముతో బాధ పడినారు. ఆరు లంఖనములు చేసిన అనంతరము స్వస్తత చేకూరినది. ప్రస్తుతము కోలుకుంటున్నారు మా తల్లిగారు మీ ఇరువురి క్షేమములు అడగమన్నారు. మీ అమ్మాయి కనక మహాలక్ష్మి మీ ఇరువురికీ నమస్కారములు అందజేయమన్నది. మీ క్షేమ సమాచారములతో జాబు వ్రాయించ గలరు.

**ఇంతే సంగతులు, చిత్తగించవలెను,**
**ఇట్లు మీ అల్లుడు**
**నరసింహం.**

చదివి నిట్టూర్చారు పశుపతిగారు. 'పాపం జ్వరం వచ్చి తగ్గిందట. సీనయ్యని వెంటనే సమాధానం రాయమనాలి' అన్నారు.

'ఇంకానయం వియ్యపురాలికి సుస్తీ చేస్తే వుత్తరం రాసి ఊరుకుంటే బావుండదు. వెళ్ళి చూసిరావాలి' అన్నారు తాతయ్య. అవునవును అన్నారు అందరు

సోమయ్య కార్డు తీసారు చదవటం మొదలు పెట్టారు

**సోమయ్య బావకి**

బావుండావా? మా చెల్లి పిల్లలూ బావుండారా? బావా మా కోడలికి ఈ మధ్యన వొళ్ళు బాగాలేదు. అన్నం తినటం లేదు వాళ్ళ అమ్మని చూడాలంట. నేనే తీసుకొద్దావంటే పొలం పనుల్లో వున్నాము నీ అల్లుడిని తోడుకుపోరా అంటే వాడికి సిగ్గుట నువ్వే వీలు చేసుకుని వచ్చి తోడుకుపో. లేపోతే మీ చెల్లిని తోడిచ్చి పంపిస్తా .

**లక్ష్మడు వ్రాలు**

శ్రోతలందరి మొహాల్లోనూ చిరునవ్వు సోమడు తాత కాబోతున్నాడురోయ్ అని సంబర పడ్డారు.

కార్డులు అయితే చదివేశారు గానీ కవరు ఉండిపోయింది. కవరూ చదవొచ్చు. ఎవరూ ఏమీ అనరు. కానీ వీళ్ళకే మొహమాటం. ఇక మరీ ఆ వుత్తరం హక్కుదారు వూళ్ళో లేక ఇంట్లో ఆడవాళ్ళకి చదువు లేకపోతే అటువంటి ఆపత్కర పరిస్తితిలో అయితే చదువుతారు గానీ మరి సీతాపతి ఊళ్ళోనే వున్నాడు. కాబట్టి బావుండదు. కబురు వెళ్ళింది. ఆయన వస్తూనే ఉంటాడు. అయినా ఆత్రంగానే వుంది అందరికీ ఆ వుత్తరంలో ఏముందో కూడా తెలిసిపోతే నిశ్చింత.

జాబులొచ్చాయని కబురందుకుని సీనయ్యా, సోమడూ బయలుదేరారు. దార్లోనే ఇంకెవరిద్వారానో తెలిసిపోయ్యాయి కబుర్లు. ఇద్దరూ పోస్టాఫీసుకి చేరారు. ముందుగా సోమడే వచ్చాడు. మొహం వెలిగిపోతోంది. 'రారా తాతయ్యారా' అంటూ అందరూ ఆహ్వానించారు. ఇప్పుడు అమ్మాయికి నలత.. అంటే సంక్రాంతి, తరువాత పురుడు పంటా మనవడు ఒకేసారి ఇంటికొస్తారు అని లెక్కలు వేసి చెప్పారు.

'ఇవ్వాళ మంచిది. ఇవ్వా ళే బయలు దేరి వెళ్ళు. రేపు బిడ్డని తీసుకు రా. మళ్ళీ ఎల్లుండి నించి మంచిరోజులు కావు' అన్నారు. అన్నిటికీ తలూపాడు సోమడు

అంతలో సీనయ్య వచ్చాడు 'మావియ్యపురాలికి ఆరోగ్యం బాగాలేదటగా?' అని వారినే అడిగాడు

'ఇప్పుడు బాగానే ఉందిటలే. కోలు కుంటోందట. నువ్వు వెళ్ళి చూసి వస్తే బావుంటుంది' అన్నారు పశుపతిగారు అలాగే అన్నాడు సీనయ్య .

'నువ్వు ఇదుగో అంటే ఆర్నెల్లు. వెంటనే వెళ్ళు. ఆవిడకి పూర్తిగాతగ్గి గుండ్రాయిలా తిరగడం మొదలు పెట్టాక వెళ్తే ఏం ప్రయోజనం?' అన్నారు తాతయ్య.

'లేదు మావయ్యా! రెండు రోజుల్లో వెళ్తాను' అన్నాడు ఆయన.

'చేతులూపుకుంటూ వెళ్ళకు. పండో ఫలమో తీసికెళ్ళు' అన్నాడు మరోపెద్దాయన.

యిక్కడ ఈ వ్యవహారం అంతా నడుస్తున్నా అందరి చూపులూ రోడ్డుమీదే వున్నాయి

'ఏడీ రాడేం సీతాపతి? పాతాలు చెపుతున్నాడేమో!? పాతాలు ఎక్కడికి పారిపోతాయి రమ్మనండి' అని మళ్ళీ కబురు పెట్టారు. అందరికి ఆత్రం. ఆ మూడో వుత్తరం కూడా చదివేస్తే సరిపోతుంది

అలా నలుగురు కబురుతో వెళ్ళాక అప్పుడొచ్చాడు సీతాపతి.

'ఏవిరా ఇప్పుడా రావటం?' అని అందరూ నిలదీశారు అతడేదో చెప్పబోతే 'సర్లే అవన్నీ తర్వాత ముందు వుత్తరం చదువు' అని తొందర పెట్టారు

కవరు విప్పి చదువుతుంటే 'పైకి చదువు.. పైకి చదువు' అన్నారందరూ, పెద్దగా అందరికీ వినిపించేలా చదవటం మొదలుపెట్టాడు సీతాపతి

**చిరంజీవి సీతాపతికి**

మీ బాబయ్య గోపాలం ఆశీర్వదించి వ్రాయునది. ఉభయ కుశలోపరి.

నీకు ఓ శుభ సమాచారం. ఆ మధ్య సరస్వతి వివాహానికి వచినప్పుడు మన జానకిని బాపట్ల సుందరయ్యగారి భార్య సుబ్బమ్మ గారు చూసిందిట. వారి అబ్బాయికి ఈడూ జోడుగా వుంటుందని అనుకున్నదట. వారి బంధువు ఈ ముక్క నాచెవిన వేసాడు. ఇదంతా చూస్తుంటే వారు ఈ విషయంలో సుముఖంగా ఉన్నట్లు తోస్తోంది. నీవు వీలు చూసుకుని వస్తే ఇద్దరం వారి ఇంటికి వెళ్ళి మాట్లాడితే బాగుంటుందని నా అభిప్రాయం. దేవుడు దయ తలిచి ఈ సంబంధం కుదిరితే నువ్వూ, నీ చెల్లెలూ కూడా అదృష్ట వంతులు. జాప్యం చెయ్యకు.

KOUMUDI

**ఇట్లు.**

**నీ బాబయ్య, గోపాలం**

శ్రోతలంతా సంతోష పడ్డారు. ఇవ్వాళ అన్నీ మంచి విషయాలే. ఒక్కో రోజు అన్నే దుర్వార్తలే మోసుకోస్తాడు ఈ రంగడు. అనుకున్నారు. సీతాపతి మొహంలో మాత్రం సంతోషం కనిపించలేదు. 'అదేవిట్రా చెల్లెలు పెళ్ళి అంటే సంబర పడక డీలా పడిపోయావేం?' అన్నాడు ఒకాయన

'పెళ్ళంటే మాటలా? నామొహం నాకేం తెలుసు? నాన్నే వుంటే..' అంటూ కళ్ళనీళ్ళ పర్యంతం అయ్యాడు. అంతా జాలిగా చూసారు. సీతాపతి తండ్రి ఈ మధ్యనే పోయాడు. జానకి అతని చెల్లెలు ఇంకా ఇద్దరు తమ్ముళ్ళు కూడా వున్నారు. తల్లి నాయనమ్మా కూడా వున్నారు. సంసారం బాధ్యత అంతా అతనిదే

తాతయ్య కల్పించుకున్నారు. 'వుంటే బాగానే వుండేది. లేనంత మాత్రాన ఏదీ ఆగదు. నాన్న లేకపోతేనే బాబాయి వున్నాడు చెట్టంత మేనమామ వున్నాడు. వీళ్ళంతా నిలబడి పెళ్ళి చేయించేస్తారు' అన్నారు.

'అదికాదు తాతయ్యా! మాట సాయం చేసినా పెళ్ళంటే డబ్బు కావద్దూ. అసలే బోలెడు ఖర్చుల్లో వున్నాను.. ' అన్నాడు తలొంచుకుని.

'నిజమే తండ్రి పోయి ఏడాది కాలేదు. ఈ ఏడు అతని పొలంలో పంట కూడా బాగా పండలేదు' జాలిగాచూసారు అందరూ.

'అవన్నీ చూసుకోవచ్చులేరా ముందు నువ్వెళ్ళి మాట్లాడిరా. అంతా సానుకూలం అయితే పెళ్ళే చెయ్యి లేకపోతావా? నువ్వు వూళ్ళో వున్నావు గానీ అడివిలో లేవుకదా మేమంతా లేవుటా? ' అన్నారు. 'అవునవును' అందరూ వంత పలికారు.

‘వెంటనే వెళ్ళు‘ అని ఎప్పుడు వెళ్ళాలో నిర్ణయించేసారు. ఆవిషయం వెంటనే కార్డు తీసుకుని గోపాలంగారికి సీతాపతి చేత వుత్తరం రాయించేశారు.

పశుపతిగారి భార్య ఇంటి వెనక సావిట్లో ఆకు వేసి అన్నం వడ్డిస్తే తిని వరండాలోకి వచ్చాడు రంగడు.

‘ఇవిగోరా ఉత్తరాలు‘ అంటూ పోస్టు చెయ్యాల్సిన కార్డులు మూడు అందించారు పశుపతిగారు. పోస్టు డబ్బా ఓ అలంకారం అంతే. అందులో ఎవరూ ఉత్తరాలు వెయ్యరు. రంగడు వచ్చేవేళకి వచ్చి అతనికి అందిస్తారు. అసలు చాలామందికి పశుపతిగారు రాసిపెట్టాల్సిందే. వాళ్ళకి చదువురాదు.

ఆవేల్టి సందడి ముగిసింది కాబట్టి అంతా లేచారు

"అయ్యగారూ వుత్తరాలమీద ముద్దర్లు వేసారా?" గుర్తు చేసాడు రంగడు. నాలిక కరుచుకున్నారు పోస్టు మాష్టరుగారు. సీనయ్యనీ, సోమదినీ సీతాపతినీ వెనక్కి పిలిచి వుత్తరాలమీద ముద్దర్లు కొట్టారు. వెళ్ళే మూడు కార్డుల మీద కూడా ముద్దర్లు కొట్టి ఆ పూట పని ముగించారు .

ఆ మూడు కార్డులనీ భద్రంగా మూట కట్టుకుని సైకిలు ఎక్కాడు రంగడు

KOUMUDI

# అప్పడాల సందడి

**వేసవి కాలం వచ్చిందంటే చాలు మా ఊళ్ళో సందడే సందడి.** వేసవి సెలవలకి అందరిళ్ళకీ బంధువులు వస్తారేమో ఊరొచ్చి వూరి మీద పడ్డట్టుగా వుంటుంది. ఆడవాళ్ళందరూ లెక్కలేనన్ని పనుల్లో మునిగి తేలుతూ వుంటారు. ఊరగాయలు, అప్పాడాలొత్తటం, వడియాలు పెట్టుకోటం, అటుకులు దంపించుకోవటం.. అబ్బో ఆ సందడి చెప్పనలవి కాదు

ఇవన్నీ ఎవరికి వారు ఎవరింట్లో వారి పనులు గుట్టుగా చక్కబెట్టుకోడంకాదు. వంతుల వారీగా ఒక్కొక్కరింట్లో ఒక్కో రోజు అందరూ కలిసి చేస్తారు

మర్నాడు మా ఇంట్లో అప్పడాలు వత్తడానికి తీర్మానించారు అందరూ. ఆ రోజంతా సందడి. అమ్మమ్మా మరో ఇద్దరు కలిసి పిండి విసిరి జల్లించి తడిపారు. ఆ సాయంత్రం పిలుపులు. ఫలాని వారింట్లో ఫలాని రోజున అని అందరికీ తెలుసు. ఆ మాటకొస్తే ఆ నెలలో కార్యక్రమం మొత్తం అందరికీ కంఠతా వచ్చు. అయినా కొన్ని పద్ధతులు వున్నాయి వాటిని ఖచ్చితంగా పాటించాల్సిందే అందులో భాగంగానే అమ్మమ్మ నన్ను అందరిళ్ళకి వెళ్ళి చెప్పి రమ్మంది

ఏం చెప్పాలో చెప్పి నాచేత మళ్ళీ చెప్పించుకుని, తప్పులుంటే సరిచేసి మరికొన్ని జాగర్తలు చెప్పి, ''ఇక వెళ్ళిరా'' అంది. నేను బయలు దేరాను. ముందుగా సుబ్బమ్మ తాతమ్మా వాళ్ళింటికి వెళ్ళాను. తాతమ్మ నన్ను చూడగానే ''ఏవిటే అమ్మడూ ఇట్లా వచ్చావు? '' అంది.

''రేపు మాఇంట్లో అప్పడాలొత్తాలిట కదా! అమ్మమ్మ చెప్పి రమ్మంది'' అన్నా !

''అవునుకదూ మర్చేపోయాను. '' అంది. అంతా వుత్తిదే! ఆవిడకి అన్నీ బాగానే గుర్తుంటాయి. వూరికే అట్లా అంటుంది. ఆ మాట అమ్మమ్మ చెప్పింది కూడాను

''నువ్వు మర్చి పోతావనే చెప్పి రమ్మంది అమ్మమ్మ'' అన్నాను.

''సర్లే పదిగంటల కల్లా వచ్చేస్తానని చెప్పు. '' అని నాకు ఓ అరిటి పండు ఇచ్చింది. తిన్నాక ''అమ్మడూ ఇవి పట్టుకెళ్ళు'' అని అప్పడాల పీట కర్రా ఇచ్చింది. ఇలాటి పనుల కొచ్చేటప్పుడు ఎవరి వస్తువులు వాళ్ళే తెచ్చుకుంటారు. కొత్త వాటితో పని తీరుగా సాగదుట.

అక్కడినించీ సీతమ్మమ్మ వాళ్ళింటికి. అక్కడా మళ్ళీ అదే మాటచెప్పాను. ఆవిడ పెట్టిన చక్కిలం తిని ఆవిడిచ్చిన పీటా కర్రా తీసుకుని రెండు పీటలు మోసుకుంటూ తిరగటం ఎందుకని అవి ఇంట్లో పెట్టి ఇంకో ఇంటికెళ్ళాను.

అక్కడా అదే తంతు కొందరేమో ఏవో కబుర్లు చెప్పి, మా ఇంటి గురించి మానాన్నగారికి ఏమాత్రం జీతం వస్తుంది? మా అమ్మ నాకేమాత్రం బంగారం చేయించింది? వగైరా వివరాలు రాబట్టాలని చూసారు. అలా ఎవరైనా ఏమైనా అడిగితే నోరెత్తొద్దని అమ్మమ్మ ముందే చెప్పటంతో ''నాకవన్నీ తెలయవు. ఇంకా చిన్న పిల్లనేగా పాపం'' అని వినయంగా చెప్పాను. వాళ్ళు నవ్వుకుని ''సరేలే వెళ్ళిరా..'' అని పంపించేసారు.

మొత్తం మీద పది ఇళ్ళు తిరిగా. మధ్యలో అయిదు సార్లు ఇంటికొచ్చి పీటలు కర్రలు ఇంట్లో పెట్టి వెళ్ళా. నాపని అయ్యేసరికి చీకటి పడుతోంది.

ఆఖరు ఇంట్లో పిల్చేసి ఇంటికొచ్చేసరికి ''అమ్మయ్యా అయిందా అమ్మా!? అలిసిపోయి ఉంటావు. కాళ్ళు కడుక్కురా అన్నం తిందువుగాని.. '' అంది అమ్మమ్మ.

KOUMUDI

"అయ్య బాబోయ్.. నా వల్లకాదు" అన్నాను.

"అదేవిటే ఇంతసేపు తిరిగావు అలసటగా లేదూ? ఆకలేయ్యటం లేదూ?" అంది అమ్మమ్మ.

"అందరిళ్ళల్లో ఏదో ఒకటి తింటూనే వున్నాను."అన్నా.

"అవును మరి వెళ్ళక వెళ్ళక వాళ్ళింటికి వెళ్తే చిన్నపిల్లని ఒట్టిగా పంపిస్తారా?" అంది అమ్మమ్మ.

"ఏంతిన్నావేమిటి? " అమ్మ అడిగింది. ఏం తిన్నానో ఓసారి నెమరు వేసుకున్నా.

"అరిటిపండు, చక్కిలం, లడ్డు, వెన్న బిస్కెట్టు, ఎండు కొబ్బరిముక్క, ఖర్జూరం పండ్లు, వేరుసెనగపప్పు పాకం, కారపు అటుకులు పప్పుచెక్క, కారప్పూస."

నేను చెప్పిన లిస్టు విని అమ్మ నోరావలించింది. వో కస్తూరి మాత్ర తెచ్చి వేసుకోమంది, కడుపునెప్పి రాకుండా, ముందు జాగర్తగా. ఆ పూట అన్నం తినలేదు. తాతగారు భోజనం చేస్తుంటే పక్కనే కూర్చున్నా. ఆ పూట అన్నంలో పొడి అప్పడాలపిండి స్పెషల్. వేడి అన్నంలో అప్పడాల పిండి కలిపి, ఇంత నెయ్యి పోసి కలుపుకుని నాకూ ఓ ముద్ద పెట్టారు.

మర్నాడు పెందలాడే వంటలు చేసేసారు. పదింటినించి ఆడవాళ్ళ రాక మొదలయింది. ముగ్గురు కూర్చుని పిండి బాగా కలిపి ఉండలు చేసేసారు. కాస్త అటూ ఇటూగా అందరూ వచ్చేసారు. అప్పడాలు వత్తటం ఆరంభించారు. ఓ పక్కన చాపలు పరిచి వాటిమీద పాత చీరలు పరిచారు. అప్పడాలు వట్టి చాటలో వేస్తుంటే, ఇద్దరు వాటిని చాపలమీద పరుస్తున్నారు. అందరూ కలిసారేమో కబుర్లే కబుర్లు. పని కూడా చక చక సాగిపోతోంది. మధ్యలో గొంతు ఎండిపోతే లేచి వెళ్ళి కుండలో వున్న చల్లటినీళ్ళు తాగి వస్తున్నారు

మధ్యలో కాస్త అప్పడాలపిండి ఇమ్మంది మా అమ్మ. "నాన్న అన్నంలో వేసుకుంటారుట.." అంటే కాస్త పిండి అరిటాకులోపెట్టి ఇస్తున్నారు. ఎవరైనా తుంటరి పిల్లలు వెళ్ళి "అప్పడాల పిండి కావాలిట మా తాతయ్యకి" అంటే "పోరా వెధవా నీ వేషాలు మా దగ్గర కాదు. పిండి తీసుకు పోయి బొమ్మలు చేసి తగలేడతావు" అని కసిరి పంపేస్తున్నారు.

"ఏవిటే సీతాలక్ష్మి రెండేళ్ళుగా మీ ఇంట్లో అప్పడాల సందడే లేదు. అప్పడాలు కాశీలో వదిలేశారా ఏవిటే?" అని అడిగింది తాతమ్మ.

సీతాలక్ష్మి మొహం వాడిపోయింది.. "ఏం చెప్పమంటావు పిన్నీ?మా సరసి పెళ్ళి గోలలో పడి మాకు మనశ్శాంతి లేకుండా అయిపోయింది" అంది.

సీతాలక్ష్మికి ఓ ఆడపడుచు వుంది.. సరస్వతి. చూడ్డానికి చక్కగా వుంటుంది. పనీ పాటా వచ్చు కాకపోతే కాలు కొద్దిగా వంకర నడవకలదు కానీ కాస్త వంకరగా నడుస్తుంది. అందుకే పెళ్ళి కుదరటం లేదు.

"అవున్లే పాపం.. గుండె మీద కుంపటిలా వుంది. అవతల నీ కూతురు ఎదిగి వస్తోంది. దీని పెళ్ళి కాకుండా దానిపెళ్ళి చేసినా బాగుండదు" అన్నారందరూ జాలిగా. సుభద్ర అత్తయ్య వాళ్ళింటికి స్వరాజ్యం అని ఓ చుట్టం వచ్చింది. ఆవిడా వచ్చింది మాఇంటికి. ఈ సంభాషణ విని "ఎవరా సరస్వతి? ఏమిటి విషయం?" అని అడిగింది. అందరూ పోటీలు పడి చెప్పేశారు.

"నాకు తెలిసి ఓ సంబంధం వుంది. " అంది స్వరాజ్యం.

"అలాగా చెప్పు" అన్నారు అందరూ. పని ఆపేశారు

"మా ఆడపడుచు మరిది వున్నాడు స్కూల్లో టీచరు. మూడెకరాలు పొలం వుంది.. కాకపోతే రెండో పెళ్ళి. మొదటి భార్య పురిట్లో పోయింది రెండేళ్ళ పిల్లవాడు వున్నాడు. ఇన్నాళ్ళు అతని నాయనమ్మ చూసింది. వాడిని మళ్ళీ పెళ్ళి చెయ్యాలని చూస్తున్నారు" అని వివరాలు చెప్పింది. అందరూ శ్రద్ధగా విన్నారు. మంచి సంబంధం మరి వాళ్ళొప్పుకుంటారో లేదో అన్నారు.

KOUMUDI

దేవుడిచ్చిన ఆ లోపం తప్ప సరస్వతి చక్కటిపిల్ల బుద్ధిమంతురాలు అన్నారు. చెప్పటం ఎందుకు? చూపిస్తే చూస్తుంది. ఈవిడకి నచ్చితే వాళ్ళకి చెపుతుంది, వాళ్ళకి నచ్చితే చేసుకుంటారు - అనుకున్నారు. వెంటనే సరస్వతిని పిలిపించారు. సరస్వతి చేత కాసేపు ఆపనీ ఈపనీ చేయించి "ఇక వెళ్ళు" అని పంపించేసారు.

"ఏమ్మా?" అనిఅడిగింది తాతమ్మ.

"పిల్ల బాగుందండీ" అంది స్వరాజ్యం.

"మరికనేం మీ వాళ్ళకి చెప్పు. ఈ ఉపకారం చేసావంటే నీకు కొండంత పుణ్యం దక్కుతుంది. పిల్ల విషయంలో మాది పూచీ. మెట్టినింట అందరికి తలలో నాలికలాగా వుంటుంది. పెట్టుపోతల్లోను లోపం చెయ్యరు" అంది పెద్ద తరహాగా.

"సరే పిన్నిగారూ.. వాళ్ళకి వుత్తరం రాయిస్తాను" అంది స్వరాజ్యం.

మూడు వారాల తరువాత సీతాలక్ష్మి వాళ్ళింట్లో అప్పడాల సందడి. మామూలు అప్పడాలు కాదు సరస్వతి పెళ్ళి కోసం అప్పడాలు! ఆ వైశాఖంలోనే పెళ్ళి చేసుకుని కాపరానికి వెళ్ళి పోయింది. సరస్వతి చంకన కొడుకుని ఎత్తుకుని పెళ్ళికూతురిలా కాకుండా పురిటికొచ్చిన తల్లిలా బండి ఎక్కింది. సవితి బిడ్డని స్వంత బిడ్డలా ఆదరిస్తున్న భార్యని చూసి మురిసిపోతూ అనుసరించాడు ఆమె భర్త.

అంతే మరి.. ఎవరికి ఎవరిని రాసిపెట్టాడో ఆ దేవుడు. ఆ సమయం వచ్చేసరికి తెరచాటునించి బయట పడతారు. అని వూళ్ళో ఆడంగులంతా శ్రీలక్ష్మిగారింట్లో అప్పడాలొత్తుకుంటూ సరస్వతి పెళ్ళి ముచ్చట్లు చెప్పుకుని ఆనందించారు

KOUMUDI

# మా సమ్మర్ క్యాంపు

**"మీ మకాం ముందు గదిలోకి మార్చుకోండి" అంది అమ్మమ్మ.**

"ఏం మీరంతా ఏమైనా ప్రోగ్రాం పెట్టుకున్నారా?" అన్నారు తాతయ్య.

"నేనుకాదు. మీ మనవరాలు" అంది అమ్మమ్మ.

"అమ్మడూ.. ఇవ్వాళ మనింట్లో చేరుతున్నారా మీరంతా?" మురిపెంగా అడిగారు తాతయ్య.

"అవును" అన్నాను.

"అబ్బో ఇహనేం సాయంత్రం దాకా మనిల్లు గలగల్లాడిపోతుంది" అని సరదాపడ్డారు.

నేను పొద్దున్నే స్నానం చేసేసి చద్దెన్నం తినేసి రెడీ అయిపోయాను. మూలగదిలోకి వెళ్ళి నా మూట అందుకున్నాను. పెద్దగుమ్మడికాయంత మూట. ఆకుపచ్చని రంగు దిండు గలీబులో కట్టిన మూట నేను ముట్టుకోగానే గలగల్లాడింది. అందులో ఉన్నవి నాకు రత్నమాణిక్యాలతో సమానం. వరండాలోకి వచ్చి మూట విప్పి గుమ్మరించాను. ముదురు కెంపు రంగులో మెరిసిపోతున్నాయి, చింత గింజలు. నేను ఆడుకుంటానని ప్రతి ఏడూ చింతపండు గింజలు తీసినప్పుడు ఒలీవంకా లేని గింజలు నాకోసం ఏరి మూట కడుతుంది అమ్మమ్మ.

కాసేపటికే వచ్చేశారు నా ఫ్రెండ్స్ అందరూ. ఆరుగురం. మా సరస్వతి గుట్టగా పోసిన గింజలన్నీ సమానంగా పరిచింది. అలా పరవటం ఒక కళ. ఆకాశంలో చుక్కల్లాగా పరవాలి. అందులో సరస్వతి ఎక్స్‌పర్ట్. అందరం పంటలు వేశాం. సుందరి గెలిచింది. ఆట మొదలయింది. చెయ్యి తిప్పి కాసిని గింజలు వేసుకుని అవిగాల్లోకి ఎగరేసి అరిచేత్తో పట్టుకుని ఆట మొదలుపెట్టింది సుందరి. పట్టుకోడంలో గింజ కిందపడితే వాళ్ళ ఆటపోయినట్టు పక్కవాళ్ళు ఆడాలి.

గింజలకి ఒక లెక్క ఉంది నాలుగు గింజలు ఒక పుంజీ. రెండు పుంజీలు ఒక కట్టు. అయిదు కట్లు ఒక గుర్రం... అయిదు గుర్రాలు ఒక ఏనుగు. అలా ఎన్ని ఎక్కువ గింజలు ఆడి గెలిస్తే అంత గొప్ప. మధ్యాహ్నం భోజనాలకి వచ్చినప్పుడు తాతయ్యగారు నిలబడి చూసారు.

"అబ్బో కృష్ణదేవరాయలు గజబలం లాగా ఉన్నాయే మీ ఏనుగులు" అని సరదా పడ్డారు.

వంతుల వారీగా వెళ్ళి భోజనాలు చేసి వచ్చాం. సాయంత్రం అయిదు గంటలకి "ఇక ఆపండి తల్లుల్లారా" అని అమ్మమ్మ పోరితే అప్పుడు చాలించాం.

"ఇవ్వాళ మనిల్లు చిలకలు వాలిన చెట్టులాగా ఉంది" అని మురిసిపోయారు అమ్మమ్మ తాతయ్య.

రాత్రి అన్నాల దగ్గర "రేపెక్కడే తల్లీ మీ అడ్డా? " అని అడిగారు.

"సావిత్రీ వాళ్ళింట్లో" అన్నాను. వేసవి సెలవల్లో అదే మాకు కాలక్షేపం.

మగపిల్లలు అయితే మావిడి తోటల వెంబడి తిరిగీ, చెరువుల్లోనూ దొరువుల్లోనూ ఈతలూ ఎండన పడి ఆటలూ ఎండలో తిరగటంతో రూపులు మారిపోయేవి. తల్లులే గుర్తుపట్టలేక సతమతం అయేవాళ్ళు. "వాడు పెద్దక్క కొడుకు సూర్యం కదుటే" అంటే "కాదు చిన్నక్కా చిన్నన్నయ్య కొడుకు బాచిగాడు. " అని తికమక పడిపోయేవాళ్ళు. "వెధవల్లారా ఎండల్లో తిరిగి కాకుల్లాగా తయారవుతున్నారు. కిందపడి దెబ్బలు తగిలించుకుంటున్నారు. వీళ్ళని చూడండి ఇంటిపట్టున ఉండి ఎంత చక్కగా ఆడుకుంటున్నారో" అని మాతో పోల్చి వాళ్ళని కోప్పడేవాళ్ళు. వాళ్ళేమో పెద్దవాళ్ళు చూడకుండా మాకు మొట్టికాయలు వేసి జుట్టు పీకి బదులు తీర్చుకునే

KOUMUDI

వాళ్ళు. మగపిల్లలు ఉడుక్కున్నా మావి నిజంగానే మంచి ఆటలు. అయిదు రాళ్ళతో అచ్చనగాయలు ఓ సుద్దముక్కతో నేలమీద గీసుకుని అష్టాచమ్మా, ప్రతి ఇంట్లోనూ పచ్చీసు పట్టా పర్మనెంటుగా చెక్కే ఉండేది. అవి చాలు గంటలు నిముషాల్లా గడిచిపోయేవి. పెద్దవాళ్ళ నోటికి దడిసి లేచి వెళ్ళి అన్నాలు తినేవాళ్ళం గానీ మాకు ఆకళ్ళు కూడా ఉండేవి కాదు. సాయంత్రం చల్లపడ్డాక గుళ్ళో చేరేవాళ్ళం. పరుగులు పెట్టి ఆటలు నేల బండ, దాగుడు మూతలు అలిసిపోయేదాకా ఆడుకునేవాళ్ళం. పూజారి గారు ఇచ్చిన తీర్థం తీసుకుని ఇళ్ళకు పోయేవాళ్ళం.

వేసవి సెలవులు ఇట్టే గడిచిపోయేవి.. తిరుగుప్రయాణం. "ఇంకో నాలుగు రోజులు ఉండకూడదా?" అని అమ్మమ్మ దీనంగా అడగటం "స్కూళ్ళు తీస్తారు కదమ్మా మరి వెళ్ళాలి" అని అమ్మ తప్పుచేసినట్టు సమాధానం చెప్పటం.. ఇక తిరుగు ప్రయాణానికి సన్నాహాలు.. కొత్తావకాయ జాడీలు, పిండివంటలు, అప్పడాలు, వడియాలు.. బోలెడన్ని సరుకులు, సరంజామా .

సెలవులకి పుట్టింటికి వచ్చిన ఆడపిల్లలు తమ పిల్లలని వెంటబెట్టుకుని ఇంటింటికీ తిరిగి వెళ్ళొస్తానని చెప్పటం, "వాళ్ళకి బొట్టు పెట్టి వచ్చారని ఆనందించినంత సేపు పట్టలేదు మా సందడంతా వెంటపెట్టుకు పోతున్నారు" అని గుడ్ల నీళ్ళు కుక్కుకుంటూ మళ్ళీ దసరా సెలవులకి రావాలి అని పెద్దవాళ్ళు ఆశీర్వదించటం.!

తెల్లారి పొద్దున్నే అన్నాలు తినేసి బండి ఎక్కటం. అదే మొదటిసారి అమ్మను వదిలి వెళుతున్నట్టూ అమ్మ ఏడుపు, అమ్మమ్మ ఏడుపు. "తప్పుకదూ" అని తాతయ్య మందలించటం. బండి ఎక్కి దార్లో పుట్టలమ్మ ఆలయం దగ్గర దిగి దణ్ణం పెట్టుకుని మళ్ళీ బండెక్కి మధ్యలో ఎదురై "వెళుతున్నారా అమ్మా జాగర్త వెళ్ళగానే జాబు రాస్తావుగా" అని పలకరించే వాళ్ళందరికీ సమాధానం చెపుతూ మల్లె తోటలకూ, మంచినీళ్ళ బావికీ వీడ్కోలు పలుకుతూ రోడ్డు మీదికి చేరి మర్రిచెట్టు కింద ట్రంకు పెట్టె మీద కూర్చుంటే ఎప్పటికో వచ్చే బస్సెక్కి ఊరు దాటుతుంటే వేసవి సెలవలు అయిపోయాయి. మళ్ళీ ఏడాది వరకూ ఎదురు చూడాలి కదా అని ఏడుపు వచ్చేది.

.

KOUMUDI

## జాగర్త అది వింటుంది

**మేము కొత్తగా టేప్ రికార్డర్ కొన్నాం.** జపాన్ కంపెనీది. రెండు స్పూల్స్ తిరుగుతూ ఉండేవి. మనం మాట్లాడింది రికార్డు చేసుకునేందుకు వీలుగా మైక్రో ఫోన్ విడిగా వుండేది రికార్డు చెయ్యాలంటే మైక్రో ఫోన్ కనెక్ట్ చేసేవాళ్ళం. యాజలి వెళ్తూ తీసుకువెళ్ళాం. ఆ వూళ్ళో రేడియో నే గొప్ప. గ్రామ్ ఫోన్ వుంటే ఇంకా చాలా గొప్ప. టేప్ రికార్డర్ విషయానికి వస్తే అటువంటి వస్తువు ఒకటి వుందని కూడా ఎవరికీ తెలియదు

మా టేప్ రికార్డర్ చిన్న సైజు బ్రీఫ్‌కేసంత సైజులో వుండేది. కారు దిగి టేప్ రికార్డర్ చేతులో పుచ్చుకుని లోపలి వెళ్ళగానే " ఏవిట్రా బాబూ ఆ హస్త భూషణం? " అని అడిగారు తాతయ్య గారు.

"టేప్ రికార్డర్" అని చెప్పాడు అన్నయ్య.

"అంటే ఏవిటో?" అని అడిగారు మళ్ళీ.

"పాటలు వస్తాయి" అన్నాడు అన్నయ్య.

"ఓహో ఇదో కొత్తరకం రేడియో అన్నమాట" అన్నారాయన.

"రేడియో కాదు టేప్ రికార్డర్" అన్నాడు అన్నయ్య ఓపిగ్గా.

"వాకిట్లో నిలబెట్టి ఏవిటా పంచాయితీ లోపలికి రానివ్వండి" అంటూ వచ్చింది అమ్మమ్మ.

భోజనాలప్పుడు మళ్ళీ టేప్‌రికార్డర్ ప్రసక్తి వచ్చింది.

"యెంత పెట్టికొన్నారేవిటీ ఆ కొత్త రేడియోనీ?" అని అడిగారు తాతయ్యగారు.

"మీరే చెప్పుకోండి" అన్నాడు అన్నయ్య.

కాసేపు అలోచించి "పదో పదిహేనో రూపాయలుంటుంది" అన్నారు. నవ్వేసాం మేము. ఆయన బస్తా ధాన్యం రెండు రూపాయలు మానెడు నెయ్యి రూపాయి వుండగా ఆర్థిక శాఖ వేరేవాళ్ళకి అప్పగించేసి నిశ్చింతగా వుంటున్నారు కాబట్టి ఆయనకీ తాజా ధర వరలు తెలియవు

అమ్మమ్మకి ప్రస్తుత పరిస్తితి తెలుసును. ఆవిడ నవ్వింది "ఇంకా నయం.. ఓ యాభై రూపాయలుంటుంది" అంది. అన్నం తింటున్నామేమో మా ఇద్దరికీ కోరబోయింది

"ఎనిమిది వందలు" అన్నాడు అన్నయ్య. వడ్డిస్తున్న పులుసు గరిట గిన్నెలో పారేసి రాయిలా నిలబడి పోయింది అమ్మమ్మ.

"అంత పెట్టి కొన్నారా ఈ పాటల పెట్టెనీ ? వంటరికాపరం. పెద్దవాళ్ళు దగ్గర లేరు. బొత్తిగా వొళ్ళు తెలియటం లేదు మీకు . ఆడపిల్ల వుంది. దానికి వంకీనో అడ్డిగో వచ్చేది ఆ డబ్బుతో" అని అమ్మని బాగానే మందలించింది,

భోజనాలు అయ్యాక అందరం హాల్లో కూచున్నాం. మా పనిమనిషి సుబ్బాం వచ్చింది వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటూ వుంటే అన్నయ్య ఆ సంభాషణ రికార్డు చేసాడు

మీకో తమాషా చూపిస్తా అంటూ ప్లే చేసాడు

"యేవే సుబ్బాం ? యేవే పెసలూ ? తెస్తా తెస్తా నంటావూ! తేవూ !"

KOUMUDI

"రేపు తెత్తనమ్మ గారూ "

"ఈ మాటే పదిరోజుల నించీ చెపుతున్నావు. రేపు తెస్తే సరే లేకపోతే అచ్చాయిని తెమ్మంటాను ఈ ఏడు వాడి చేలోనూ బాగా పండాయిట పెసలు . వాడైతే ఇంకో పావలా తక్కువకే ఇస్తాడు "

" వద్దమ్మ వద్దు రేపు పుట్టలమ్మ సాచ్చిగా నేనే తెత్తా."

వత్తులు చేసుకుంటున్న అమ్మమ్మా, ఇల్లు చిమ్ముతున్న సుబ్బాం ఇద్దరూ నోరెళ్ళ బెట్టి రాళ్ళలా బిగుసుకు పోయారు

" ఏవి(టా బాబూ ఇది? " అమ్మమ్మ అయోమయంగా అడిగింది

"మరి ఇదే దీని ప్రత్యేకత! మనం మాట్లాడిన మాటలు రికార్డు చేసి మనకు వినిపిస్తుంది" అన్నాడు అన్నయ్య.

"ఏదీ మళ్ళీ పెట్టు అని పది సార్లు విని పరవశించి పోయారు. ఒసే సుబ్బాం నువ్వెళ్ళి రాజమ్మనీ విశాలమ్మనీ కేకేసుకురా. వాళ్ళూ వింటారు"అంది అమ్మమ్మ.

పరుగున వెళ్ళి వాళ్ళిద్దరితోబాటు మరో పదిమందిని కేకేసు కొచ్చింది సుబ్బాం.

అందరూ పరుగున వచ్చారు "అబ్బో ఏం విచిత్రం.. ఏం విచిత్రం" అని మురిసి పోయారు.

వాళ్ళందరి మాటలూ కూడా రికార్డు చేసాడు అన్నయ్య రాత్రి దాకా మా ఇంట్లో తిరనాల్లా ఒకటే జనం. అక్కడితో ఆగలేదు ఆసందడి. మరో రెండు రోజులు వచ్చే జనం పోయే జనం. అందరి గొంతులూ రికార్డు చెయ్యటం నాపని మొత్తానికి అందరి మాటలూ టేపుల్లోకి ఎక్కాయి.

ఆ తర్వాత మధ్యాహ్నం అయేసరికి ఒక్కొక్కరూ రావటం "ఏదీ నామాటలు పెట్టు" అని విని ఒకటే మురిసి పోవటం! అలా ఓ నాలుగు రోజులు గడిచింది. ఆ తరువాత "ఏదీ ఆ సీతమ్మ ఏవన్నదీ ? పెట్టు విందాం" అని ఎవరెవరు ఏం మాట్లాడారో వినటం ప్రారంభం అయింది. "సీతారావమ్మ గారు ఎవన్నదో పెట్ట"మంది పున్నమ్మ గారు.

"ఏవమ్మా మొన్న గుళ్ళో పురాణానికి రాలేదేం?" అన్న అమ్మమ్మ ప్రశ్నకు

" ఆ !! నా బతుకే ఓ పురాణం ఇంటి చాకిరితోనే తెల్లారి పోతోంది. కోడలుందంటే దానికి కోడిపిల్లల్లాగా వెంటనలుగురు పిల్లలు. వాళ్ళతోనే సరిపోతుంది దానికి" అన్నది సీతారావమ్మ.

ఇదంతా విన్న పున్నమ్మ ఆమాటలు సీతారావమ్మ కోడలు తులసికి చేరేసింది. ఇక చెప్పేదేముంది కోడలు అత్తమీద దండెత్తింది. అత్తా ఎదురుతిరిగింది. ఇద్దరికీ దెబ్బలాటలు అయ్యాయి వాళ్ళకి తోడూ మగవాళ్ళు కూడా మాటా మాటా అనుకుని అల్లరయ్యాక తీర్పు కోసం తాతయ్య దగ్గరికి వచ్చారు

"నేనలా అనలేదు .. పున్నమ్మ పితూరీలు చెప్పింది" అంటుంది సీతారావమ్మ.

"నాకేంపని లేనివి కల్పించి చెప్పడానికి ? రుజువుంది కావలిస్తే ఆ పెట్టెని అడగండి చెప్తుంది" అంది పున్నమ్మ.

మల్లె టేప్‌రికార్డర్ లో ఆ మాటలన్నీ విన్నారు అందరూ

తాతయ్య గారు పెద్దరికంగా తులసినే కేకలేశారు. ఆవిడ "నీ అత్తగారు పెద్దది ఓ మాట అంటే తప్పా? నీకూ నీపిల్లలకీ చాకిరీ చేసింది కాబట్టి వున్న మాటే అన్నది గానీ లేనివి కల్పించి అనలేదుగా! దానికింత రాద్ధాంతం చెయ్యాలా?" అన్నారు.

"ఆడవాళ్లేదో గొడవపడితే సర్దేయ్యాలిగానీ మీరిద్దరూ దెబ్బలాడుకొడం చాలా అందంగా వుంది" అని మగవాళ్ళనీ కోప్పడి పంపించేసారు

అంతా వెళ్ళాక మమ్మల్ని పిల్చి

KOUMUDI

"ఇదేవిటో ఈ కొత్త రేడియో కాదుగాని.. చాలా గొడవగా వుంది. విన్నది విన్నట్టు ఊరుకోకుండా అక్కడివి ఇక్కడా ఇక్కడివి అక్కడా చెప్పి తగాదాలు పెడుతోంది. ఇంతకాలం మనూళ్ళో ఏ గొడవలూ లేకుండా ప్రశాంతంగా వున్నాం.  మంధరలాగా. ఇది మనకు వద్దు దీన్ని డిస్పోసే ఆఫ్ చేసెయ్యండి"  అన్నారు

ఆ గొడవ తరువాత మా టేప్ రికార్డర్‌లో మాట్లాడతామని ఎవ్వరూ రాలేదు సరికదా దాన్ని తప్పించుకు తిరగటం మొదలు పెట్టారు. ఏదైనా మాట్లాడుకోవాలన్న "ఇక్కడొద్దులే తల్లీ ఆ ఘటం వింటుంది అవతలికి వెళ్ళి మాట్లాడుకుందాం" అని దొడ్లో బావి దగ్గరికిపోయి గుస గుసగా మాట్లాడుకునేవాళ్ళు "ఏవర్రా కొంపతీసి దూరంగా వెళ్ళి మాట్లాడుకున్నా  ఇది గానీ విని అక్కడా ఇక్కడా చెప్పదు కదా!? " అని భయంగా మమ్మల్ని అడుగుతూనే వుండేవాళ్ళు.

KOUMUDI

# అసలు రహస్యం

**ఆవేళ శుక్రవారం**. పొద్దుటే లేచి, కాలకృత్యాలు తీర్చుకుని, దైవ ధ్యానం ముగించి, కోడలు ఇచ్చిన పాలు తాగి ఇంటివెనక అరుగు మీద కూర్చుంది బాలమ్మ మామ్మ. మెళ్ళోని పగడాల తావళంతో జపం చేసుకుంటున్నా ఆవిడ దృష్టి అంత దూరాన గట్టుమీద పడుతున్న ఎండ మీదే వుంది.

ఎండ గట్టుదిగితే పది గంటలు అయినట్టు. ఎండ గట్టు దిగింది. పగడాల దండ మెళ్ళో వేసుకుని

" అమ్మాయ్ కామేశ్వరి " అని కేకేసింది.

కామేశ్వరి ఆ ఇంటి ఆఖరి కోడలు.."పిలిచారా ?" అంటూ వచ్చింది .

"గాజుల బత్తుడు ఒచ్చాడా ?" అని అడిగింది ఆత్రంగా.

"ఇంకా రాలేదు. వచ్చేవేళ అయ్యింది" అని చెప్పి వెళ్ళి పోయింది.

అదిమొదలు.. అయిదయిదు నిముషాలకీ ఎవర్నో ఒకరిని పిల్చి " వచ్చాడా గాజుల బత్తుడూ? " అని అడుగుతూనే వుంది.

"అబ్బబ్బ చచ్చిపోతున్నాం ఈవిడతో అయినా ఇదేం ఆరాటం? పోనీ ఆవిడేమైనా గాజులు వేయించుకుంటుందా అంటే ఎప్పుడో చిన్నతనంలోనే ఆ వైభోగం పోయి సైను పంచల గతి పట్టింది. మరి అదేవిటో ఎవరొచ్చారో ఎవరు పోయారో పట్టించుకోదుగానీ గాజుల బత్తుడికోసం ఆత్రంగా ఎదురు చూస్తుంది. మడి ఆచారం అంటూ ఎవరికీ వడ్డన చెయ్యదు గానీ గాజుల బత్తుడికి మాత్రం స్వయంగా వడ్డిస్తుంది"

మొత్తానికి పదకొండు అయ్యాక వచ్చాడు గాజుల బత్తుడు. మలారం దింపుకున్నాడు.

ఆ వెంటనే బిల బిల్లాడుతూ ఆడవాళ్ళు ఓ పదిమంది వచ్చేశారు. కాసిని మంచినీళ్ళు తాగి భుజాన వున్న కండువా నేలమీదపరిచి మూట లోంచీ పొడుగాటి గాజుల పొత్తులు తీసి వరసగా పరిచాడు.

అక్కడ చేరిన వారి కళ్ళు మెరిసాయి. యెర్ర గాజులు, పచ్చ గాజులు, నీలం ఆకుపచ్చ పువ్వుల గాజులు, సాదా గాజులు, చిన్న పిల్లలకు రబ్బరు గాజులు, చంటి పిల్లలకు నల్లని గాజులు..

వరసగా వచ్చి గాజులు ఎంచుకుంటున్నారు. ఒక్కో చేతికీ డజను చొప్పున గాజులు తొడుగుతున్నాడు బత్తుడు. డబ్బులిస్తున్నారు కొందరు, 'వడ్లు ఇస్తాను.. ఇంటికొచ్చి పట్టుకెళ్ళు' అంటున్నారు కొందరు. 'ఆయన లేరు.. ఈ సారి వచ్చినప్పుడు ఇస్తా' అంటోంది ఓ ఇల్లాలు.

అందరికీ చిరునవ్వుతోనే సమాధానం చెప్తున్నాడు.

ఇప్పుడా? పాతికేళ్ళుగా వస్తున్నాడు మావూరికి. పదిహేనురోజులకి ఒకసారి వస్తాడు. దమ్మన్న వారిపాలెం, బుద్ధాం కర్లపాలెం, రాంభట్ల పాలెం, కావూరు ఖాజీ పాలెం ఒకటేమిటి చుట్టుపక్కల ఊళ్ళు అన్నీ అతనివే. గాజుల మలారం భుజాన వేసుకుని ఊరూరా తిరుగుతాడు.

ఇక్కడ బేరం ముగించుకుని మూట సర్దుకుని మరో వీధికి వెళ్తాడు. మావూళ్ళోనే మూడుచోట్ల మలారం దించి అందరికీ గాజులు తొడిగి మళ్ళీ మాఇంటికి వచ్చి అన్నంతిని బయట అరుగుమీద కాసేపు నడుము వాల్చి లేచి వెళ్ళిపోతాడు.

KOUMUDI

అతనొచ్చేదాకా భోజనం చెయ్యకుండా కూచుంటుంది మామ్మ. 'మేము పెడతాం.. పెద్దదానివి నీకు కళ్ళు తిరుగుతాయి' అన్నా వినదు.

బత్తుడు వచ్చాడు. "కాళ్ళు కడుక్కో వడ్డిస్తా .. " అని ఇంటికి వెనక అంతదూరాన వున్న సావిట్లో బాదం ఆకుల విస్తరి వేసి వడ్డించి కాస్తాదూరంలో పీట వాల్చుకుని కూర్చుంది.

మరో గొడవ కూడా వుంది.. అతనికి తను అన్నం పెడుతున్నంతసేపు ఎవరూ అటు రాకూడదు. వస్తే తిట్టిపోస్తుంది మామ్మ.

ఆతను అన్నం తిన్నాక బావిదగ్గరికి వెళ్ళి, నాలుగు చాదలు నీళ్ళు తోడి పోసుకుని, ఎంగిలిపడేసరికి ఆవిడకి సోష వచ్చినంత పని అవుతుంది.

"ఎందుకమ్మా ఈ వయసులో నీకింత హైరానా? " అంటే వినదు. విసిగిపోయిన ఆ ఇంటివాళ్ళు అన్నం పెడుతూ ఆవిడ ఏం మాట్లాడుతోందో వినమని నాకు పని అప్పగించారు. అటువంటి గూఢచారి పనులకు నేను పెట్టింది పేరు. నాకు తాయిలాలు పెట్టి అత్తాకోడళ్ళు, తోడికోడళ్ళు ఇటువంటి పనులు చేయించుకోడం అలవాటే.

శుక్రవారం నాడు సావిట్లో నక్కి దాక్కున్నా.

ఆకువేసి అన్నం పెట్టింది బామ్మ. " నాయనా మా అన్నయ్య బావున్నాడుట్రా?" ఆత్రంగా అడిగింది.

"బావున్నారమ్మా! మా బాలమ్మ ఆరోగ్యంగావుందా ?అని అడిగారు" అన్నాడతను .

కళ్ళొత్తుకుంది బామ్మ " కాస్త లేచి తిరుగుతున్నాడా ? తనపని తను చేసుకుంటున్నాడా? ఎవరికీ భారంగా లేడుగా ?" మళ్ళీ అడిగింది.

"ఇంట్లో తిరుగుతున్నారమ్మా. మీగురించి సరిగ్గా ఇలాగే అడిగారు అయ్యగారు " అన్నాడు ఆతను.

"పనులన్నీ పూర్తి చేసుకుని ప్రయాణానికి సిద్ధంగా వున్నాను. మరి ఆ పై వాడి దయ ఎప్పుడో? పిలుపు ఎప్పుడొస్తుందో? మళ్ళీ శుక్రవారం దాకా ఉంటానో వుండనో.. మా అన్నయ్యని అడిగానని చెప్పునాయనా. నమస్కారాలని చెప్పు. ఎవరి చెవినా పడకుండా చెప్పు తెలిస్తే మళ్ళీ గొడవ " అంది మామ్మ రెండు చేతులూ జోడించి కళ్ళు మూసుకుని.

"ఈ మాట ఇవ్వాళ కొత్తాగా చెప్పాలా అమ్మా? ఎన్నేళ్ళుగా చెప్తున్నాను" అన్నాడతను. ఆ తరువాత ఆవిడేం మాట్లాడలేదు.

ఆ సాయంత్రం మామ్మ లేకుండా చూసి ఇదంతా ఇంట్లో వాళ్ళకి చెప్పాను. మామ్మ మేనల్లుడు యాభైఏళ్ళ సత్యం మావయ్య ఇదంతా విని ఆశ్చర్యపోయాడు. తరువాత భుజాన వున్న కండువాలో మొహం దాచుకుని ఏడిచాడు. ఆయనేకాడు అక్కడున్న అందరూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు .

ఇంటికెళ్ళి ఇదంతా చెప్తే అమ్మమ్మ కూడా కంట తడిపెట్టుకుంది.

పెద్దవాళ్ళంతా చిన్న పిల్లల్లాగా ఎందుకు ఏడుస్తున్నారో అంతుపట్టలేదు నాకు. అమ్మమ్మని అడిగితే చెప్పింది .

బాలమ్మ మామ్మకి ఒక అన్నయ్య, ఒక తమ్ముడు. కాపరానికి వెళ్ళకుండానే భర్త పోతే పుట్టింట్లోనే ఉండిపోయింది. తమ్ముడి భార్య గంపెడు మంది పిల్లల్నికని అర్ధంతరంగా చనిపోతే, తమ్ముడింటికి వచ్చి ఇక్కడే ఉండిపోయింది. కొంతకాలం తరువాత ఆ తమ్ముడూ పోయాడు. ఆ తరువాత దాయాదులకి ఏవో గొడవలు వచ్చాయి. ఆ ఇంటి కాకి ఈ ఇంటి మీద వాలటం లేదు. ఈ గొడవల్లో అన్నాచెల్లెళ్ళు ఇరుక్కుపోయారు. ఆవిడకి ఎనభై దాటాయి. ఆయనకీ ఎనభై అయిదు. వంటరిగా వెళ్ళే శక్తీ లేదు పిల్లలని అడిగే ధైర్యమూ లేదు. అందుకే గాజులబత్తుడి ద్వారా యోగక్షేమం తెలుసుకుంటూ తృప్తి పడుతున్నారు.



KOUMUDI

అదీ అసలు రహస్యం. నేను ఇదంతా చెప్పిన మరునాడు తెల్లవారుతూనే మామ్మ మేనల్లుడు శ్రీధరం బండి కట్టించుకుని బాలమ్మ మామ్మని వెంటబెట్టుకుని కావూరు పెద్దనాన్న దగ్గిరికి వెళ్ళాడు.

పోన్లే ఆ అన్నాచెల్లెళ్ళు ఇన్నాల్టికి మళ్ళీ ఒకరిని ఒకరు చూసుకుంటారు అని ఆనందించారు అందరూ.

ఆ మహత్కార్యంలో ఉడతలాగా సాయం చేసినందుకు నేనూ ఆనందించాను.

KOUMUDI

## పోస్ట్ చేసిన ఉత్తరం

**మా ఊళ్లో బాల్వాడీ స్కూల్ పెట్టారు కొత్తగా.** అప్పట్లో అది కొత్త కాన్సెప్ట్. చిన్న పిల్లలని బతిమాలి బుజ్జగించి బళ్లోకి తీసుకురావటం. వాళ్లకి ఆటపాటలతో చదువు చెప్పటం. ప్రభుత్వం వారు ఇచ్చిన పాలపొడితో పాలు కలిపి ఇవ్వటం, రవ్వతో మధ్యాహ్నం ఉప్మా చేసి పెట్టటం అంతా సందడిగా ఉండేది.

ఆ స్కూల్‌ని నిర్వహించే బాధ్యతా మా చిన్నమ్మమ్మది. ఆవిడే మా ఊరి మహిళా మండలికి వైస్ ప్రెసిడెంట్. ఊళ్లో అందరు ఆడవాళ్లల్లోకి ఆవిడే సమర్థురాలు. ఆ రోజుల్లో పేపరు చదివి వార్తలు వినే ఏకైక నారీమణి మా ఊళ్లో ఆవిడే మంచి మనిషి.

కాస్త తొందరపాటు స్వభావం. కోపం వచ్చిందంటే గడ్డిమంటలాగా భగ్గున మండి చల్లారిపోతుంది.

బాల్వాడీ స్కూల్‌లో టీచర్లని ప్రభుత్వం వారే పోస్ట్ చేసారు. పనిమనిషిని ఎప్పాయింట్ చేసే బాధ్యత చిన్నమ్మమ్మకే అప్పగించారు. ఆవిడ తన పనిమనిషి సుబ్బరాములుని ఆ పోస్ట్‌లో వేయించింది. గవర్నమెంట్ ఉద్యోగం. నెలకి ఇరవై రూపాయలు జీతం. ఇక సుబ్బరాములుని పట్టతరం కాలేదు ఎవరికీ. మామూలుగానే మాట దురుసు సుబ్బరాములుకి. పని మాత్రం అద్భుతంగా చేసేది.

అదొక్కటే పదిమంది పెట్టు అని చెప్పుకునేవారు అందరూ. మా చిన్నమ్మమ్మ దగ్గర చాలా శ్రద్ధగా పనిచేసేది. ఉద్యోగం వచ్చాక ఆ విశ్వాసం కూడా తోడయింది. రాముల వారి దగ్గర ఆంజనేయ స్వామిలా ఉండేది. పొద్దున్నే వీళ్ళింట్లో పని చేసి స్కూల్‌కి వెళ్లిపోయేది సాయంత్రం రాగానే మళ్లీ పనికి వచ్చేది. అలా కొన్నాళ్లు బాగానే గడిచింది. స్కూల్లో పని ఎక్కువ అయిపోయి చిన్నమ్మమ్మా వాళ్లింట్లో పని దాటెయ్యటం మొదలు పెట్టింది. పప్పులు బాగు చెయ్యమనో బూజులు దులపమనో అదనంగా పనిచెపితే 'రేపు చేస్తా.. ఎల్లుండి చేస్తా ' అని దాట వేయటం మొదలు పెట్టింది.

KOUMUDI

మా అమ్మకి కోపం వచ్చి కేకలేసేది. 'ఇప్పుడేం కొంపలంటుకు పోతున్నాయి అమ్మగారూ రేపు చేస్తాగా ' అనేది సుబ్బరాములు.

ఆవిడకి మరింత కోపం వచ్చి వెంటనే నన్ను పిలిచి 'ఓ తెల్లకాయితం పట్రా. బిడిఓ గారికి ఉత్తరం రాయాలి ' అని ఆర్డర్ వేసేది నేను వెంటనే రెడీ అయిపోయేదాన్ని. ఆవిడ చెపుతుంటే రాసేదాన్ని.

**గౌరవనీయులు బ్లాక్ డెవలప్ మెంట్ ఆఫీసరుగారి దివ్య సముఖమునకు,**

**యాజలి మహిళా మండలి వైసు ప్రెసిడెంటు సీతారావమ్మ రాయు అర్జీ,**

అయ్యా, మీరు స్థాపించిన బాల్వాడీ స్కూల్ చక్కగా నడుస్తూ ఉన్నది. కానీ అందులో పనిమనిషిగా ఉన్న సుబ్బరాములు చాలా నిర్లక్ష్యంగా ప్రవర్తించుచున్నది. చెప్పిన మాట వినకపోవుట ఎదురు సమాధానం చెప్పుట చాలా దూర్తంగా ఉన్నది ఆమె ప్రవర్తన. కావున మీ తక్షణము సుబ్బారాములని ఉద్యోగము నుండి తొలగించి దాని స్థానములో వేరొకరిని నియమించావలసినదిగా మనవి చేయుచున్నాను. ఈ విషయముపై వెంటనే చర్య తీసుకొనగలరు.

**ఇట్లు మీ విధేయురాలు.**

అని నాచేత రాయించి సంతకం పెట్టి కవర్లో పెట్టి అడ్రసు రాయించి వెళ్లు వెళ్లి 'పసుపతిగారికి ఇచ్చిరా. హుటాహుటీ పంపించమని చెప్పు' అని తరిమేది. నేను వెళ్లి ఆయనతో ఆ మాటే చెప్పేదాన్ని.

'అర్జెంటుగా వెళ్లాలని నేను పరిగెత్తలేనుగా. ఇవ్వాళో రేపో వస్తాడు రంగడు. అప్పుడు పంపిస్తా ' అనేవారు పశుపతిగారు.

ఆ మర్నాడు సుబ్బరాములు అమ్మమ్మ దగ్గరికి వెళ్లి ఆవిడ చెప్పిన పనులన్నీ చిటికెలో చేసేసి అదనంగా ఇంకొన్ని పనులు కూడా చేసేసేది. ఇల్లూ వాకిలీ అద్దంలాగా చేసి పెట్టేది. ఆవిడకి కాళ్లకి నూనె రాసి మర్దనా చేసేది. అది అటు వెళ్లగానే నన్ను పిలిచేది అమ్మమ్మ.

'అమ్మడూ సుబ్బరాములు విషయంలో మనం తొందర పడ్డామేమో అనిపిస్తోందే!' అనేది. నేనేం చేసాను ఆవిడ రాయమన్నది రాసానంతే. ఆ మాటే చెప్పేదాన్ని. కాసేపు ఆలోచించేది. ‘అది ఓ వెర్రిమొద్దు. మాట కాస్త విసురుగానీ పని చక్కగా చేస్తుంది. ఉద్యోగం ఊడగొట్టి ఆ పాపం మూట కట్టుకోటం ఎందుకు? నువ్వెళ్లి ఆ ఉత్తరం వెళ్లిందేమో కనుక్కో. వెళ్లి ఉంటే దాని ఉద్యోగం ఉంచమని ఇంకోటి రాద్దాం. ఇక్కడే ఉంటే అడిగి ఇప్పించుకురా. ‘ అని తోలేది.

నేను వెళ్లేదాన్ని పశుపతిగారి ఎదుట నిలబడి ‘తాతయ్యగారూ మా అమ్మమ్మ బిడివో గారికి రాసిన ఉత్తరంట పంపించారా? ‘ అని అడిగేదాన్ని.

‘ఇంకా లేదు ‘ అనేవారు ఆయన. ‘ఆ ఉత్తరం తిరిగి ఇచ్చెయ్యమంది చిన్నమ్మమ్మ ‘ అని చెప్పేదాన్ని. ఆయన చిరాకు పడేవారు. ‘బొత్తిగా క్రమశిక్షణ లేకుండా పోతోంది. ఓ సారి పోస్టు చేసాక ఉత్తరం తిరిగి ఇవ్వటం రూల్సుకి విరుద్ధం. ఏమన్నా గట్టిగా అందామంటే అందరూ అయినవాళ్లే అయెనూ. సరే తీసుకెళ్లు ఈసారికి ఇస్తున్నా. ఇకమీదట ఇవ్వనని వదినకి గట్టిగా చెప్పు ‘ అని సణుక్కుంటూనే వెళ్లి ఆ ఉత్తరం తెచ్చి ఇచ్చేవారు. అది తీసుకెళ్లి అమ్మమ్మకి ఇస్తే ఆవిడ నా బుగ్గలు పుణికి ముద్దుపెట్టుకుని ఆ ఉత్తరం నీళ్లపొయ్యిలో పారేసేది.

KOUMUDI

# బొమ్మలపెళ్ళి

**బుధవారం పంచమి బావుంది అన్నారు తాతయ్య పంచాంగం చూసి.** అదే ఖాయం అనుకున్నాం మేమందరం. మేము ఆడపెళ్ళివాళ్ళం. శాస్త్రుల్లగారి మనవరాలు భారతీవాళ్ళు మగపెళ్ళివారు. మరి ముహూర్తం నిశ్చయం అయింది కాబట్టి ఏర్పాట్లు చేసుకోవాలి. ఆవేళ సోమవారం నా బొమ్మల పెట్టిలోంచి బొమ్మలు బయటికి తీసాను. మగబొమ్మను భారతి తీసుకెళ్ళిపోయింది. ఆడబొమ్మను శుభ్రంగా తుడిచి కాస్త పత్తి తీసుకుని ఓ చుక్క నూనెలో ముంచి తుడిచాం. మెరిసిపోయింది నల్లకొయ్యతో చేసిన బొమ్మ.

బట్టలు కుట్టే మస్తానమ్మ దగ్గరకి వెళ్ళి "మా బొమ్మకి కొత్తచీర కావాలి కుట్టిస్తావా అన్నాం.

"ఇప్పుడే పిల్లాడి వాళ్ళొచ్చారు బట్టలకోసం. ఎల్లుండనగా పెళ్ళి? రేపొచ్చి తీసుకుపొండి" అంది.

"ముందే చెప్తున్నాం మస్తానమ్మా.. వాళ్ళ అబ్బాయి బట్టలకన్నా మా అమ్మాయి బట్టలే బావుండాలి" అన్నాం.

నవ్వేసింది మస్తానమ్మ. "వాళ్ళూ ఈ మాటే చెప్పారు. నాకు తెలుసుగా నే కుడతా పొండి" అంది.

పిచ్చాయిని పిలిపించి "ఒరే బొమ్మల ఇంటికి కాస్త సున్నం వెయ్యి ఎల్లుండే పెళ్ళి" అని చెప్పింది అమ్మమ్మ. దక్షిణం మూల గోడకి ఆనుకుని ఉన్న బొమ్మరింటికి సున్నం వేసేసాడు పిచ్చాయి.

మర్నాడు అమ్మ దగ్గరకి వెళ్ళి పెళ్ళి కూతురుకి నగలు చేసి పెట్టమన్నాం. చిన్న చిన్న పూసలు చమ్కీలు పోగేసి నగలు తయారుచేసింది అమ్మ. చమ్కీతోనే మంగళ సూత్రం చేసి పసుపుతాడుకి అతికించింది. నల్లపూసలు గుచ్చింది.

KOUMUDI

ఆ సాయంత్రానికి బట్టలు ఇచ్చేసింది మస్తానమ్మ. పసుప్పచ్చ సాటిను బట్టకి ఎర్రని జరీ అంచు వేసి కుట్టింది. జరీతో జాకెట్టు కుట్టింది. భలే బావున్నాయి.

బుధవారం పొద్దున్నే వెళ్ళి ఊళ్ళో పిల్లలందర్నీ పెళ్ళికి పిలిచి వచ్చాం. తాతయ్య రూపాయి ఇచ్చి పెళ్ళి విందుకోసం ఏమైనా కొనుక్కోండి అన్నారు. పరుగున వెళ్ళి గుల్ల శనగ పప్పూ, బెల్లం కొనుక్కొచ్చాం. చిన్న తాతయ్య పిలిచి ఇంకో రూపాయి ఇచ్చారు. ఎండు కొబ్బరి పంచదారా తెచ్చుకోండి అంది చిన్నమ్మమ్మ. అవి తెచ్చి ఇస్తే కొబ్బరి తురిమి పంచదార యాలుకులూ దంచి తీపి తయారు చేసింది. ఇంతలో గోపాలం తాతయ్య కబురుచేసారు. వెళ్ళాం. "డబ్బిస్తా పెళ్ళికి వాడుకోండి" అన్నారు. మాకు విసుగేసింది. అవతల బోలెడు పనులున్నాయి. తలో మారూ పిలిచి డబ్బులిస్తూ ఉంటే ఎన్నిసార్లు పరుగులు పెడతాం అంటే "అవును నిజమే నేనే ఏర్పాటు చేస్తా" అంది అమ్మమ్మ. వేరుశనగ పప్పుపాకం పట్టి పంపిస్తానంది.

"అంతా తీపే అయితే వెగటు పుట్టదూ!? " అని అటుకులు వేయించి కారం ఉప్పూ కలిపి సిద్ధం చేసింది అమ్మమ్మ.

శ్రీదేవమ్మగారు వాళ్ళ అమ్మాయి వాణీ చేత సాతాలించిన శనగలు పంపించారు.

కొత్తబట్టలు కట్టి నగలు పెట్టి బొట్టు పెట్టేసరికి పెళ్ళికళ వచ్చేసింది మా బొమ్మకి.

"సుబ్బారాయుడిని రమ్మను మేళం వాయిస్తాడు. మేళం లేకుండే పెళ్ళేమిటి? " అని ఓ మనిషిని పంపించారు తాతయ్య.

సుబ్బాయమ్మ వచ్చి ఇంటిముందు అద్దంలా చిమ్మి నీళ్ళు జల్లి ముగ్గులు వేసింది. దరియా మామిడి మండలు కోసి తోరణాలు కట్టాడు.

సాయంత్రం నాలుగింటికి మేమంతా ముస్తాబులు మొదలు పెట్టాం. పట్టు పరికిణీ కట్టుకుని నగలు పెట్టుకుని జడకుప్పెలు పెట్టి జడవేయించుకుని పూలు పెట్టుకున్నాం. బొట్టూ కాటుకా పెట్టుకున్నాం. మా ఇంట్లో ఉత్తరాలు గుచ్చే తీగలోంచి పాత శుభలేఖలు తీసుకుని వాటిని బుగ్గలమీద రద్దుకున్నా, ఆ చెమ్కీ బుగ్గలకు అంటింది దాంతో ముస్తాబు పూర్తి అయినట్టే.

కాస్త అటూ ఇటూగా అందరూ వచ్చేశారు. చిన్న వెండి కుంకుమ భరిణ తీసుకుని బయలుదేరాం. సుబ్బారాయుడి మేళం ముందు నడుస్తుంటే మగపెళ్ళివారింటికి చేరాం. వాళ్ళూ తయారుగానే ఉన్నారు. ఆలస్యంగా వచ్చారు ఆడపెళ్ళివారు అని కాస్త అలిగారు. సర్దిచెప్పాం. అందరికీ బొట్టుపెట్టి పెళ్ళికి తరిలి రమ్మన్నాం.

పెళ్ళికొడుకుని తీసుకుని బయలుదేరారు వాళ్ళు. మా ఊరేగింపు చూసి దారంతా తెగ ముచ్చటపడిపోయారు పెద్దవాళ్ళు. మేమూ వస్తాం అని కొంతమంది ఊరేగింపులో కలిసారు.

మా ఇంటికొచ్చాక పెళ్ళి కొడుకుకి దిష్టి తీసాం.

పెళ్ళి తంతు మొదలయింది. సీతారావమ్మగారి పాటలు, సుబ్బారాయుడి మేళం. పెళ్ళి ఘనంగా జరిగింది. పేరుకి బొమ్మల పెళ్ళే అయిన పెద్దవాళ్ళు చాలా మంది వచ్చి అరుగుల మీద కూర్చున్నారు. అణా బేడా చదివించారు దంపతులకి

మగపెళ్ళివారిని కూర్చోపెట్టి బాదం ఆకులు వేసి విందు వడ్డించాం. పెద్దవాళ్ళకీ పెట్టాం. తరవాత మేమూ తిన్నాం.

తరువాత అప్పగింతలు. 'సీతారావమ్మగారు పోయిరాగదమ్మ జానకీ మా తల్లి సీతా' అని అప్పగింతల పాట పాడుతుంటే మేము ఏడిచాం. మగపెళ్ళివాళ్ళూ ఏడిచారు.

మేమంతా పిల్లలం ఒకళ్ళు ఏడిస్తే మిగిలినవాళ్ళూ ఏడవటం అలవాటే.

వింత ఏమిటి అంటే ఇవ్వాళ ఈ బొమ్మని అప్పగింతలు పెడుతుంటేనే ఇంత బాధగా ఉంది మరి బొమ్మల పెళ్ళి చేసిన ఈ బంగారు తల్లులను అప్పగించే సమయం వస్తే ఎట్లా తట్టుకుంటాం? అని పెద్దవాళ్ళందరూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు.

మగపెళ్ళివారు వెళ్ళిపోయారు మేళంతో. అలిసిపోయిన మేమంతా బట్టలు కూడా మార్చుకోకుండా అట్లాగే పడి నిద్రపోయాం.

మర్నాడు సాయంత్రం బొమ్మలని తీసుకొచ్చారు భారతీవాళ్ళు. పెట్లో దాచిపెట్టాను. ఏడాదిలో వాటిని రెండుసార్లే బయటికి తీసేది. పెళ్ళికీ, బొమ్మలకొలువుకీ.

మరికాసేపటికి మా గుంపు అంతా వచ్చేశారు. నిన్నటి చదివింపులు లెక్కపెట్టాం. పద్నాలుగు అణాలున్నాయి. పాలోమంటూ వెళ్ళి నూజీడీలు, సామ్రాజ్యమ్మ దగ్గర పుణుకులూ కొన్నుక్కొచ్చుకు తిన్నాం. దాంతో పెళ్ళిసంబరాలు ముగిసాయి.

ప్రతిఏడూ బొమ్మల పెళ్ళి చేస్తే మంచి మొగుడొస్తాడు. అని మా చేత బొమ్మల పెళ్ళి చేయించే వాళ్ళు మా పెద్దవాళ్ళు. మేమూ చేసేవాళ్ళం. మరి అదేవిటో గానీ మా చిన్నతనంలో ఏ మంచి పని చేయించినా మంచిమొగుడు రావాలనే చేయించేవాళ్ళు. బాగా చదువురావాలనిగానీ, పెద్ద ఉద్యోగాలు చేసి ఊళ్ళేలాలని గానీ ఒక నోము గానీ, వ్రతం గానీ చేయిస్తే ఒట్టు.

ఏమిటో అలా గడిచిపోయింది మా బాల్యం.

KOUMUDI

# భ్రమరాంబ అక్కయ్య

**మా ఊళ్ళో బావుల్లో ఉప్పునీళ్ళు.** వాడకానికి పనికి వచ్చినా వంటకి, తాగటానికి పనికి వచ్చేవి కాదు. ఊరి చివరన ఒక మంచినీళ్ళ బావి ఉండేది. ఊరి వారందరూ అక్కడినుంచే నీళ్ళు తెచ్చుకోవాలి.

మా ఊళ్ళో ఒకావిడ ఉండేది ఆవిడ పేరు భ్రమరాంబ. ఏకాకి. ఎవరూ లేరు మా ఊళ్ళో అందరూ భ్రమరాంబ అక్కయ్య అని పిలిచేవాళ్ళు. అలా కాకుండా వేరేగా పిలిస్తే ఆవిడకి చాలా కోపం వచ్చేది.

ఆవిడ వయసెంతో ఆవిడకే తెలియదు. ఎనభై పై మాటే అని పెద్దవాళ్ళు ఉజ్జాయింపుగా చెప్పేవాళ్ళు. సన్నగా బక్క పలచగా గట్టిగా గాలి వీస్తే కొట్టుకుపోయేట్టు ఉండేది.

ఓపిక లేని పెద్దవాళ్ళకి మంచినీళ్ళబావినుంచి మంచినీళ్ళు తెచ్చిపొయ్యటం ఆవిడ అసలు వృత్తి. అదికాక ఎవరికి ఏ అవసరం వచ్చినా చేతులో పని అందుకోవటం ఆవిడ ప్రవృత్తి.

పొద్దునే లేచి బావి దగ్గరకి వెళ్ళి స్నానం చేసి ఆ తడిబట్టలతోనే నీళ్ళు తెచ్చేది. చంకలో ఒక బిందె, చేతిలో కడవ.

రెండూ తెచ్చి ఇళ్ళల్లో పోసేది. నాలుగైదు ట్రిప్పులు వేసేది. ఒక్కో బిందెకి అణా చొప్పున రెండు బిందెలకి బేడా పుచ్చుకునేది. నెలకి ఒక్కసారి జీతంలా తీసుకునేది. మరీ అవసరం పడితే నెల మధ్యలో తీసుకునేది.

పదింటికల్లా నీళ్ళమోత అయిపోయేది. ఇక అప్పుడు మిగిలిన పనులు. ఎవరింట్లో అయినా ఇల్లాలికి ఒంట్లో నలతగా ఉంటే 'భ్రమరాంబక్కయ్యా ఈ పూటకి కాస్త వంట చేసి పెట్టు' అంటే వాళ్ళింటికి వెళ్ళి వంట చేసేది.

'ఇబ్బంది వచ్చింది పిల్లలకి వంటిల్లు అప్పచెపితే కిష్కిందకాండ చేసిపెడతారు. తల్లి కాస్త ఆదుకో' అంటే ఆ మూడురోజులూ ఇంత ఉడకేసి పెట్టేది.

'పిండివంట చేస్తున్నాం ఓ చెయ్యి వెయ్యి' అంటే వెళ్ళి సాయం చేసేది. 'బంధువులొస్తున్నారు' అంటే వెళ్ళి వాలిపోయేది. 'వడియాలు పెడుతున్నాం' అంటే వెళ్ళి పప్పు రుబ్బి పెట్టేది.

అటువంటి పనులకు లెక్కగట్టి డబ్బు పుచ్చుకునేది కాదు. వాళ్ళు ఎంత ఇస్తే అంతే. ఇవ్వకపోయినా ఏమీ అనేది కాదు. బెణుకు నొప్పులకు మంత్రం వేసేది. కాళ్ళు చేతులూ బెణికితే అక్కయ్యతో చెపితే కాసిని గరిక పోచలు చేత్తో పట్టుకుని వచ్చి మంత్రం వేసేది. నొప్పి తీవ్రతని బట్టి మూడు లేక అయిదు పూటల మంత్రం వేసేది. అందుకు మాత్రం ఏమీ పుచ్చుకునేది కాదు. అలా తీసుకుంటే మంత్రం పనిచెయ్యదు అని చెప్పేది.

నయాపైసా ఆస్తి లేకపోయినా వృద్ధాప్యం మీదపడినా ఠీవిగా ఉండేది. అప్పనంగా ఏమీ ఆశించేది కాదు. చాలా ఆత్మాభిమానం కల మనిషి.

ఎవరైనా పనిచేయించుకుని 'భోజనం చేసి వెళ్ళు అక్కయ్యా' అంటే విస్తరి వేసుకుని తినేది. మిగిలిపోయిన పదార్థాలు ఇస్తే పుచ్చుకునేది కాదు.

కొత్త చీర ఇస్తే ఆనందంగా తీసుకుని 'నీ ఇల్లు చల్లగా ఉండాలి' అని దీవించేది. పాత చీర ఇవ్వబోతే మర్యాదగానే వద్దని చెప్పేది.

ఎవరింట్లో వేడుక అయితే పిలవకపోయిన వెళ్ళేది. చేతనైన సహాయం చేసి విందు భోజనం చేసి వచ్చేది.

KOUMUDI

మండుటెండులో అయినా వణికించే చలికాలంలోనైనా జోరున వానకురుస్తున్నా చంకన ఒక బిందె చేతిలో కడవ పట్టుకుని నీళ్ళు మోసే ఆవిడని చూసి 'ఈవిడ శరీరాన్ని ఏదో ప్రత్యేకమైన పదార్థంతో తయారు చేసాడు ఆ దేవుడు' అనుకునేవాళ్ళు అందరూ.

'వయసు మీదపడ్డాక నీకెందుకమ్మా ఈ పని? ఇక మానెయ్. ఈ ఊళ్ళో నీకు గుప్పెడు మెతుకులు దొరకవా? విశ్రాంతిగా ఉండు' అని తాతయ్యగారు అంటే కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

'ఏ జన్మలో ఏం పొరపాటు చేసానో ఇటువంటి రాత నా మొహాన రాసాడు ఆ దేవుడు. ఇంకా ఈ జన్మలో కూడా ఇతరులని ఇబ్బంది పెట్టటం ఎందుకు నాయనా? ముందూ వెనకా ఎవరూ లేని నాకు ఆశ్రయం ఇచ్చింది ఈ ఊరు. నాకు ఇంకా శక్తి ఉడిగిపోలేదు. జరిగినంత కాలం జరుగుతుంది. జరగనినాడు మీకు ఎలాగా తప్పదు.

ఈ ఊరికి నేను ఋణపడి ఉన్నానో ఊరే నాకు ఋణపడి ఉందో కాలమే నిర్ణయిస్తుంది' అన్నది.

ఆ వేళ ఎవరింటికో బంధువులొస్తే వాళ్ళని చూసి మంచినీళ్ళు కావాలేమో అని బావిదగ్గరికి వెళ్ళి నీళ్ళు తోడుకుని వాళ్ళింటికి వెళ్ళింది. ఆ ఇల్లాలి మొహం చాటంత అయింది.

'వచ్చావా అక్కయ్యా! నీ కోసమే కబురు చేద్దాం అనుకుంటున్నాను. దేవుడిలా నువ్వే వచ్చావు' అంది.

'బండిలో వస్తుంటే చూసాను. అందుకే నీళ్ళు తీసుకొచ్చా. వంటయిందా? ఓ చెయ్యి వెయ్యనా? ' అని అడిగి కూర తరిగి ఇచ్చింది. కందిపచ్చడి రుబ్బి పెట్టింది వాళ్ళ భోజనాలు అయ్యాక తనూ భోజనం చేసి ఇంటికి వెళ్ళింది.

మర్నాడు బారెడు పొద్దెక్కినా మనిషి అలికిడి లేకపోయేసరికి పక్కింట్లో వాళ్ళు వచ్చి చూసారు. ఎప్పుడో ప్రాణం పోయింది. కబురు తెలిసి ఊరు ఊరంతా పరిగెత్తుకొచ్చింది తమ స్వంత మనిషి పోయినట్టు బాధపడ్డారు అందరూ.

అందరూ తలాకాస్త వేసుకుని ఆవిడని సాగనంపాలని అనుకున్నారు.

'నా దగ్గర పదిరూపాయలు దాచుకుంది భ్రమరాంబక్కయ్య' అన్నారు కృష్ణమూర్తి తాతయ్య... 'నా దగ్గర నాలుగు.. మా దగ్గర మూడు' అంటూ బోలెడుమంది చెప్పారు.

అవన్నీ లెక్కవేస్తే ఆవిడ కర్మ పూర్తికాగా ఒక రూపాయి మిగులుతుంది గానీ తగలదు అని తేలింది.

'ఈ ఊరే నీకు ఋణపడి ఉంది భ్రమరాంబక్కయ్యా! ' అని కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు తాతయ్య.

KOUMUDI

# అరిసెల కథ

**మధ్యాహ్నం మా అమ్మమ్మా,** ఆవిడ తోటివాళ్ళూ కూచుని చర్చించుకుంటున్నారు.

'అడ్డెడు తవ్వెడు బియ్యం పొయ్యాలి. రేపు పిండి దంపించేద్దాం.' అనుకుంటున్నారు.

ఆ మాటలు తాతయ్య చెవిన పడ్డాయి.

" ఏమిటి విశేషం? అట్ల తద్దా? " అని అడిగారు వాళ్ళంతా వెళ్ళిపోయాక.

" చదవేస్తే ఉన్నమతి పోయిందట. అట్లావుంది మీ వ్యవహారం. మాఘ మాసంలో అట్లతద్ది ఏమిటీ? " అంది అమ్మమ్మ.

" మరి ఎందుకంత భారీగా పిండి దంపిస్తున్నావు? " అని అడిగారు.

" సీతయ్యగారింట్లో పెళ్ళికి అరిసెలు వండుతున్నాం." అంది అమ్మమ్మ.

" ఇక్కడెందుకు? వాళ్ళింట్లోనే వండితే పోలా? " అన్నారు తాతయ్య.

" ఆమాత్రం ఆలోచన లేకనా? అక్కడ వండితే పిల్లలు బతకనిస్తారా? కుచేల సంతానం. మొన్న బస్తాడు అటుకులు దంపిస్తే ఒక్క పూటలోనే అరబస్తాడు తినేశారు" అంది అమ్మమ్మ.

" నిజమే ఆ మాట!" అని ఒప్పుకున్నారు తాతయ్య.

సీతయ్యగారికి పధ్నాలుగు మంది పిల్లలు. వాకిట్లో వీధిబడి నడుపుతూ ఉంటాడు ఆయన. కాస్త పొలం ఉంది కానీ దాని మీద వచ్చే గింజలు కటాకటీ బొటా బొటీ. జేష్టా దేవి తాండవిస్తూ ఉంటుంది ఆ ఇంట్లో. దానం లేనంత మాత్రాన పిల్లలు ఎదగకా మానరు. వాళ్ళ ఖర్చులూ ఆగవు.

రెండేళ్ళక్రిందట పెద్దపిల్ల పెళ్ళిచేసారు. అంతా తలో చెయ్యి వేసి క్లుప్తంగా చేసేసారు. ఇప్పుడు రెండో పిల్ల పెళ్ళి. పెళ్ళికొడుక్కి రెండో పెళ్ళి. అయినా మంచి సంబంధమే. రెండుపూటలూ భోజనం పెట్టాలి పెళ్ళివారికి. సారె ఏమీ ఇవ్వకపోయినా పలహారాలు అయినా పెట్టకుండా ఉట్టి పిల్లను పంపలేరుగా. అందుకే అరిసెలు చక్కిరాలూ చేయిస్తున్నారు మా ఇంట్లోనే. ఖర్చు తాతయ్యగారిదే. పెళ్ళికి ఇంకా నాలుగురోజులే వ్యవధి.

మర్నాడు పొద్దుటినుంచే మా ఇంట్లో సందడి ప్రారంభమయింది. పిండి దంచటం. ఇద్దరు పోటు వేస్తుంటే ఇద్దరు పిండి జల్లిస్తున్నారు. బయట సావిట్లో పొయ్యి వెలిగించి గిన్నెలో బెల్లం పాకం కోసం పెట్టారు. మధ్యాహ్నానికి పిండి పాకం పట్టేశారు. భోజనం చేసి వచ్చి, పొయ్యిమీద మూకుడు పెట్టి, నెయ్యిపోసి అరిసెలు వండటం మొదలుపెట్టారు. కమ్మని వాసన చుట్టుపక్కల అంతా కమ్మేసింది. మొదటి వాయ తయారు కాగనే దేవుడి ముందు పెట్టి రెండు అరిసెలు పళ్ళెంలో పెట్టి తాతయ్యగారికి రుచి చూడమని ఇచ్చింది అమ్మమ్మ. మాకూ పెట్టింది. అమృతంలావున్నాయి.

"అబ్బ భలేగా కుదిరింది పాకం" అన్నారు తాతయ్య.

మేము తింటూ ఉండగానే మా ఇంటిపక్కనే ఉన్న గోడ దగ్గర కేకలు వినిపించాయి. గోడకి అవతల పక్కింటివాళ్ళ గడ్డివాము ఉంది. పక్కింటివాళ్ళ పెద్దబ్బాయి ఎవరిమీదో అరుస్తున్నాడు.

"ఏమిట్రా హనుమంతూ? ఎవరిమీద అరుస్తున్నావ్?" అన్నారు తాతయ్య.

"ఈ కోతిమూక ఇక్కడ చేరారు. వీళ్ళు పోగైతే చెట్టున పిందెలూ, కాయలూ బతకనివ్వరు" అన్నాడు హనుమంతు.

KOUMUDI

ఆ కోతిమూక అంటే ఎవరో అందరికీ తెలుసు. సీతయ్యగారి పిల్లలు. గోడదూకి జామకాయలు దానిమ్మకాయలూ తెంపుకు పోతారు. వేరుసెనక్కాయలు ఎండపోస్తే బతకనివ్వరు. గుమ్మడి గింజలు ఎండపెట్టుకుంటే కాపలా కాయకపోతే గింజ మిగలనివ్వరు. ఎన్నిసార్లు ఎంత మంది పట్టుకుని నాలుగు వాయించినా వాళ్ళకి బుద్దిరాదు.

తాతయ్య అంటే మాత్రం భయపడతారు.

"ఏరీ ఇటు తీసుకురా వాళ్ళని" అన్నారు తాతయ్య.

అందరినీ తోలుకొచ్చాడు హనుమంతు. తలలు వంచుకుని నిలబడ్డారు అందరూ. పెళ్ళికూతురుకి పదిహేనో ఏడూ. ఆ పిల్ల తమ్ముళ్ళూ చెల్లెళ్ళూ. ఆఖరుదానికి మూడేళ్ళు.

"ఏవిట్రా? ఇక్కడ మీకేం పని? ఎందుకొచ్చారు? ఎంత చెప్పినా అల్లరి పనులు మానరుకదా? అందరి చేతా గుంజీళ్ళు తీయిస్తా గోడకుర్చీ వేయిస్తా వెధవల్లారా? చెప్పండి ఎందుకొచ్చారు? " అంటూ గద్దించారు. వాళ్ళంతా భయంతో బిక్కమొహాలు వేసారు. ఏడుపొక్కటే తక్కువ.

"అక్కయ్య పెళ్ళికి అరిసెలు ఒండుతున్నారుటగా చూడ్డానికొచ్చాం" అంది ఆఖరిపిల్ల తాతయ్యగారి పక్కన ఉన్న పళ్ళెంలోని అరిసె వంక ఆశగా చూస్తూ.

తాతయ్యగారు గతుక్కుమన్నారు.

"అట్లా గోడకి ఆనుకుని వరసగా కూచోండి" అని చెప్పారు. వాళ్ళు అలాగే కూచున్నారు. అమ్మమ్మని కేకేశారు.

"వీళ్ళందరికీ అరిసెలు పెట్టు" అన్నారు.

KOUMUDI

ఆవిడ అదిరిపడింది. "వీళ్ళకా? ఈ మిడతల దండుకి భయపడేగా అక్కడ వండకుండా చాటుగా ఇక్కడ చేస్తున్నాం. వీళ్ళకి పెట్టటం మొదలుపెడితే ఇక పెళ్ళివారికి ఏం మిగుల్తాయి? " అంది అసహనంగా.

"నేను చెపుతున్నాను పెట్టు అన్నారాయన. " అది సుగ్రీవాజ్ఞ ఆవిడ సనుగుతూనే లోపలికి వెళ్ళి అరిసెలు తెచ్చింది. పిల్లల మొహాలు వెలిగిపోయాయి. వేడి వేడి అరిసెలు ఒకొక్కళ్ళూ నాలుగేసి, ఐదేసి తిన్నారు. మంచి నీళ్ళు తాగారు. "ఇకపొండి. మళ్ళీ ఇటు వస్తే కాళ్ళు విరగ్గొడతా" అన్నారు తాతయ్య. కేరింతలు కొడుతూ పారిపోయారు వాళ్ళంతా.

"మీరు చేసిన నిర్వాకం ఒకటి కాదుకదా?" అని విసుక్కుంది అమ్మమ్మ.

"పోనీలెద్దూ పిల్ల సన్నాసులు. ఏ పూట చూసినా చారన్నమేగా వాళ్ళ మొహాలకి. ఎవరింట్లోనైనా భోజనాలు పెడితే ఆ పూట పండగ. అందరూ వస్తారు. మొక్క జొన్న కండెకీ, చిలకడదుంపకూ, మరమరాలకి కూడా మొహం వాచి ఉన్నారు. పేదరికం కదా అని పిల్లల జిహ్వ చాపల్యం ఎక్కడికి పోతుంది? ఇంట్లో అక్కయ్య పెళ్ళికదా పిండివంటలు తినొచ్చని ఆశపడ్డారు. అదీ లేకపోయేసరికి కంటితో చూసి పోదామని ఇక్కడికి పరుగెత్తుకొచ్చారు. వాళ్ళని చూసి నా కడుపు తరుక్కుపోయింది. సరుకులకి కొరతలేదు నాకు. నువ్వు కాస్త అదనంగా శ్రమపడాలి. ఆ వారా ఆ పిల్లలు తృప్తిగా తిన్నారు" అన్నారు తాతయ్య.

అమ్మమ్మ నిట్టూర్చింది? "అదీ నిజమేలెండి పాపం. అల్లరి భరించలేక విసుక్కుంటాం గానీ వాళ్ళ తిప్పలు వాళ్ళవి. మంచిపనే చేసారు. అంతగా అవసరం అయితే ఇంకో మానెడు బియ్యం పోసి అరిసెలొండుతాం. చక్కిరాలూ ఎక్కువే చేయిస్తాను. అక్క పెళ్ళినాడయినా తృప్తిగా తింటారు పిల్లలు" అంది.

"ఇహనేం మీ అందరికీ యజ్ఞయాగాదులు చేసినంత పుణ్యం దక్కుతుంది" అన్నారు తాతయ్య.

# పట్టుచీర పూలబుట్టా

**మా చిన్నతనంలో ఎవరి దగ్గరా** విచ్చలవిడిగా ఖర్చుపెట్టేంత డబ్బు ఉండేది కాదు. కటాకటీ బొటాబొటీగా ఉండేవి అందరి జీవితాలు. ధనవంతులు ఉన్నా డబ్బుతో ఇంకాస్త పొలం కొనుక్కునేవారు. బంగారం కొనేవారు. ఇంకా డబ్బుంటే పరులకోసం ఖర్చుపెట్టేవారు. గుడికి ఇవ్వటం అన్నదానాలు చేయించటం వంటి మంచిపనులు చేసేవారు.

వందరూపాయలు చేతులో ఉంటే యాభై ఖర్చు చేసేవాళ్ళు. మిగతాది దాచుకునేవాళ్ళు.. అందుకే అందరూ నిరాడంబరంగా నిశ్చింతగా జీవితం గడిపేసేవాళ్ళు. గొప్పలకి పోయి బోర్లాపడటం ఉండేది కాదు. లెక్కా జమా లేకుండా బట్టలు కొనే వేలం వెర్రి లేనేలేదు. దాపుడికి నాలుగు జతలు రోజువారీ వాడకానికి నాలుగు జతలు ఉండేవి. కట్టుడు బట్టలు అనేవాళ్ళు వాటిని.

సంక్రాంతికీ ఉగాదికీ అందరూ కొత్తబట్టలు కొనుక్కునేవాళ్ళు. వినాయక చవితికి మగపిల్లలకి, వరలక్ష్మీ వ్రతానికి ఆడపిల్లలకి కొత్తబట్టలు కుట్టించేవాళ్ళు. కలిగిన వాళ్ళు పుట్టినరోజున కొత్త బట్టలు ధరించేవాళ్ళు. ఆడవాళ్ళు బజారుకి వెళ్ళి బట్టలు కొనుక్కునే పద్ధతి లేదు పల్లెటూళ్ళల్లో. సాలె వాళ్ళు మూటతో చీరెలు తీసుకుని వస్తే వాళ్ళ దగ్గర తీసుకునేవాళ్ళు. డబ్బు కూడా అప్పటికప్పుడు ఇవ్వాలనే నియమం లేదు. ఉంటే ఇచ్చేవాళ్ళు. లేకపోతే పంట ధాన్యం వచ్చాక అవి అమ్మి డబ్బులిచ్చేవాళ్ళు. కొంతమంది వడ్లు కొలిచేవాళ్ళు.

మా ఊరికి సాలె సుబ్బయ్య మూటతో తెచ్చేవాడు. చీరాల, పెడన, గుంటూరు, పేటేరు నేత చీరలు రోజువారీ కట్టుడికి తెచ్చేవాడు.

KOUMUDI

వరయూరు కోయంబత్తూరు చిన్నాలం పట్టు వగైరా రకాలు పండగల రోజుల్లో తెచ్చేవాడు.

అప్పట్లో కట్టుడికి ఒకే రకం చీరెలు రెండు కొనుక్కుని జతగా కట్టటం ఫ్యాషను. నీలం ఎరుపు, పసుపు ఆకుపచ్చ అలా కొని కట్టేవాళ్ళు. కొన్ననాటినుండీ చిరిపోయేదాకా రంగు నిప్పులా ఉండేది.

అప్పుడు రంగుల పేర్లు కూడా భలేగా ఉండేవి. అన్నీ తెలుగు పేర్లే. గుర్తున్నంతవరకూ చెప్తాను. బ్రాకెట్లో ఇప్పుడారంగులని ఏమంటున్నామో రాస్తాను.

మిరప్పండు రంగు, గులాబీరంగు, చంద్రకాంతరంగు (ఇప్పుడు రాణి కలర్ అంటున్నాం) బచ్చలిపండు రంగు (క్రిమ్‌సన్) కెంపు (మెరూన్) దానిమ్మ పువ్వు రంగు (గోల్డ్‌స్పాట్) నారింజ పండు రంగు, (ఆరెంజ్) కనకాంబరం. ఆరుద్రపురుగు రంగు, చిలకకుపచ్చ, అరిటాకుపచ్చ, ముదురాకుపచ్చ నాచురంగు (బాటిల్ గ్రీన్), పెసరాకుపచ్చ (మెహందీ గ్రీన్) గరుడ పచ్చ (ఎమరాల్డ్ గ్రీన్) , ఆకాశం రంగు, నీలిమందు రంగు, రత్నావళి(కాపర్ సల్ఫేట్) నెమలిపించం, పాలపిట్టరంగు సిరా నీలం (నావీ బ్లూ) కృష్ణనీలం (టర్కాయిస్ బ్లూ), పచ్చి పసుపు రంగు, ముదురు పసుపు (మస్టర్డ్). చామంతి రంగు, బంతిపువ్వు పసుపు రంగు, వంకాయ రంగు(వైలెట్) వంగపువ్వు రంగు(పర్పుల్) నేరేడు రంగు, డిసెంబర్ పువ్వురంగు, గచ్చకాయరంగు (యాష్ కలర్) పావురాయి రంగు (సిమెంట్ కలర్), వక్కరంగు ముక్కుపొడి రంగు (స్నఫ్ కలర్). చింత పువ్వు రంగు, ఉల్లిపాయరంగు, గంధం రంగు (శాండల్ ఉడ్ కలర్), మునిగోరింట రంగు తెలుపు, కోరా(హాఫ్ వైట్).

కలనేత చీరెలని ఉండేవి. ఇప్పుడు డబుల్ కలర్ అంటున్నాం.

ఆకుపచ్చ, కెంపు కలిస్తే మావిచిగురు రంగు. నిండు నీలం, నిండు ఆకుపచ్చ కలిస్తే నెమలి కంఠం రంగు. పసుపు, కెంపు కలిస్తే ఆవరంగు ఇక పేరులేని కలనేత రంగులు ఎన్నో చెప్పలేం. కళ్ళు తిరిగిపోయేలా ఉండేవి. నేరేడు రంగు తెలుపు, నారింజ తెలుపు, లేత నీలం కెంపు, కనకాంబరం కెంపు ఆ కలనేతల అందం వర్ణించతరంకాదు.

పమిట కొంగు వేరే రంగులో ఉంటే పాట్నా కొంగు అనేవాళ్ళు. చీర రంగులోనే ఉంటే గీరల కొంగు అనేవాళ్ళు. ఇక అంచుల విషయానికొస్తే కొండల అంచు, మామిడి పిందెల అంచు. హంసలంచు. ఉడత చారల అంచు. కడ్డీ అంచు అనాసకాయల అంచు డిజైన్‌లు ఉండేవి. అప్పట్లో పెళ్ళికి, పెళ్ళికూతురికి ఒకటి కంచి చీర, ఒకటి బెనారసు పట్టు ఒకటి పెద్దాపురం పట్టు చీర విధిగా కొనేవాళ్ళట. ఇంకాస్త కలిగిన వాళ్ళు మరో రెండు చీరలు కొనెవాళ్ళట.

అత్తవారు అయిదు పట్టుచీరలు పెట్టి పుట్టింటి వారు పట్టుచీర పెట్టి కన్యాదానం చేస్తే అది గొప్పల్లోకి గొప్ప. ఆరు పట్టుచీరలున్న ఆ భాగ్యశాలిని అందరూ ఆరాధనగా చూసేవాళ్ళట.

ఆ భాగ్యశాలి పాతికేళ్ళపాటు పెళ్ళిళ్ళకీ పేరంటాలకి ఆ పట్టుచీరెలు కట్టుకుని గర్వంగా తిరిగేసేదిట.

ఆవిడేకాదు ఆవిడపెళ్ళి చీరలని ఆవిడ ఆడపడుచులు, అక్కచెల్లెళ్ళు, తోడికోడళ్ళు కూడా కట్టుకునేవాళ్ళుట. అప్పట్లో అలా చీరెలు అరువడిగి కట్టుకోటం నామోషీకాదు. అదో సరదా.

మా అమ్మ ఆరు పట్టుచీరెలు ఉన్న భాగ్యశాలి. అట్లా అందరూ ఏళ్ళ తరబడీ కట్టుకుని పాతబడి చీరలు చిరిగిపోయాయిట. అసలు కథ ముందేవుంది. చీర చిరిగినా కూడా విలువ తగ్గేది కాదు.

మా అమ్మవి రెండు చీరెలు, జానెడంచు చీరంతా బుటా పెద్ద కొంగూ ఉన్న గచ్చకాయ రంగు బెనారసు చీర, తెలుపూ పసుపూ కలనేతకి జానెడు మామిడిపిందెల అంచు ఉన్న కంచి చీర చిరిగిపోతే, తెనాలి వెండి దుకాణానికి తీసికెళ్ళి కరిగించి ఆ వెండితో పూలబుట్ట కొన్నారుట.

నాలుగు దోసిళ్ళ పువ్వులు పట్టే పూలబుట్ట. జాలీ డిజైన్, లతలూ, పువ్వులూ, ఒకపక్క వ్యత్యస్థ పాదార విందుడైన కృష్ణుడి బొమ్మా. ఆ వెండి పూలబుట్ట నాకు ఇచ్చింది మా అమ్మ. అది నా దగ్గర భద్రంగా ఉంది. మా ఇంట్లో పండగ వచ్చినా పూజ జరిగినా ఆ పూలబుట్ట బయటికి తీస్తాను. శుభ్రంగా తోమించి నిండా పూలు నింపితే నాకు ఎంతో తృప్తిగా ఉంటుంది.

పట్టుచీర కట్టుకుని మా అమ్మ నా ఇంటికి వచ్చినంత ఆనందంగా ఉంటుంది.

KOUMUDI

# మా ఇంట్లో కాఫీ ప్రహసనం

**సూర్యోదయానికి** ఇంకా ఓ గంట ముందుగానే మా ఇంట్లో అందరూ లేచేవాళ్ళు. ఇంట్లో పక్కలు ఎత్తి, ఇల్లు చిమ్మేవాళ్ళు. తాతయ్య వేపపుల్ల నోట్లో పెట్టుకుని వెళ్ళిపోయేవారు. పనిమనిషి సుబ్బాం వాకిట్లో చిమ్మి కళ్ళాపు చల్లేది. అమ్మమ్మ ముగ్గు డబ్బా తీసుకుని చక్కగా ముగ్గు వేసేది.

పాలేరు వచ్చి దూడని వదిలేవాడు. అమ్మమ్మ పాలచెంబు ఇచ్చేది.

మా ఇంటి వెనక పెద్ద అరుగులుండేవి. ఆ అరుగు మీదనే కాఫీ పెట్టేది అమ్మమ్మ. అదేమీ అల్లాటప్పా వ్యవహారం కాదు. బోలెడంత తతంగం ఉంది దానికి.

వంట పొయ్యిలో మిగిలిన బొగ్గులు ఆరబోసి ఓ డబ్బాకి ఎత్తి ఉంచేది. ఆ బొగ్గులు సులభంగా అంటుకుంటాయిట. కడిగి బోర్లించిన కుంపటి, కొబ్బరి పీచు, నిప్పుపెట్టే, బొగ్గుల డబ్బా తెచ్చుకుని అరుగు మీదికి చేరేది. బాగా ఎండిన కొబ్బరి పీచు కుంపట్లో అడుగున పరిచి, దానిమీద బొగ్గులు వేసి అంటించేది. విసన కర్రతో అలవోకగా విసిరితే బొగ్గులు అంటుకుని ఎర్రగా మారేవి.

స్టీలు గిన్నెతో నీళ్ళు కుంపటి మీద పెట్టి, మూతపెట్టి బొగ్గుల డబ్బా లోపల పెట్టి చేతులు కడుక్కుని కాఫీ గింజల డబ్బా, చేతి మర బిగించిన కుర్చీ, పీటా తీసుకొచ్చేది. వారానికి సరిపడా కాఫీ గింజలు ఒక్కసారే వేయించి గాలి జొరబడని డబ్బాలో పోసి ఉంచేది. ఏరోజుకి ఆరోజు గుప్పెడు గింజలు మిషన్లో ఆడించేది. 'మేము తిప్పుతాం' అని పిల్లలం అడిగినా ఒప్పుకునేదికాదు. 'మీ మొహం, బరబరా తిప్పేస్తే బరకగా అవుతుంది. మెల్లిగా తిప్పితే పిండి అయిపోతుంది. మీకు చేతకాదు' అని తనే తిప్పేది.

సరిగ్గా కాఫీపొడి తయారయ్యేసరికి గిన్నెలో పెట్టిన నీళ్ళు తెరలి మూతకదలాడటం మొదలయ్యేది. నీళ్ళగిన్నె దింపి మసులుతున్న నీళ్ళల్లో పొడివేసి కాసిని చన్నీళ్ళు చిలకరించి మూతపెట్టేది.

అప్పుడే పాలేరు పాలచెంబు పట్టుకొచ్చేవాడు. అందులోంచి కాఫీకి కావలసిన పాలు గిన్నెలో పోసి కుంపటిమీద పెట్టేది.

ఆ వేళ్టికి తాతయ్యగారు తిరిగి వచ్చేసేవారు. ఇంట్లో జనాభా అంతా అరుగుమీదికి చేరేవాళ్ళు. ఇంట్లో వాళ్ళేకాదు పక్కింటి రాఘవయ్య తాతయ్య కూడా గోడ దగ్గరికి వచ్చి 'అమ్మా అయిందా కాఫీ?' అని అడిగేవారు.

'కలుపుతున్నా అన్నయ్యా.. రా..' అనేది అమ్మమ్మ.

పాలపొంగు రాగానే దించి వేరేగిన్నెలో గుడ్డ వేసి, డికాషను వడకట్టి వేడి పాలు కలిపేసరికి కమ్మని కాఫీ వాసన గాల్లోకి తేలేది. అందరూ తన్మయత్వంతో ముక్కులు ఎగ పీల్చేవాళ్ళు. పంచదార వేసి బాగా కలిపి మరో రెండు నిమిషాలు కుంపటి మీద పెట్టి దించి అందరికీ గ్లాసుల్లో పోసి అందించేది.

ఆ గ్లాసులు భారీగా పావుశేరు పట్టేలా ఉండేవి. తాతయ్యగారికి ప్రత్యేకంగా ఓ కంచు గిన్నె ఉండేది. కంచుగ్లాసులు కాలుతూ ఉంటే ఉత్తరీయంతోనో, కొంగుతోనో పట్టుకుని ఊదుకుంటూ ఆ రుచిని ఆస్వాదిస్తూ కబుర్లు చెప్పుకుంటూ తాపీగా సేవించేవాళ్ళు.

పొరుగూళ్ళ నుంచీ వచ్చిన వాళ్ళు ఆ వేళ్టికే మా ఇంటికి వచ్చేవాళ్ళు. తాతయ్యని పలకరించినట్టూ ఉంటుంది, అమ్మమ్మ చేతి అమృతం లాంటి కాఫీ తాగినట్టూ ఉంటుంది.

'జ్వరం వచ్చి నోటికి ఏమీ రుచించటంలేదు కరణం గారింటికి వెళ్ళి కాస్త కాఫీ పోయించుకు రమ్మ'ని పంపగా వచ్చినవాళ్ళు అందరూ అరుగు మీదికి చేరేవాళ్ళు.

KOUMUDI

రెండో విడత కాఫీ కలిపేది అమ్మమ్మ. మళ్ళీ అందరికీ గ్లాసుల నిండా పోసేది. బోలెడు బోలెడు కబుర్లు చెప్పుకుంటూ కాఫీతాగేవాళ్ళు.

చిన్నా చితకా విషయాల నుండి గంభీరమయిన సమస్యలదాకా ఎన్నో రకాల చర్చలు జరిగిపోయేవి కాఫీ సమావేశంలో.

ఆఖరుగా ఓ గ్లాసుడు కాఫీ సుబ్బాంకి ఇవ్వటంతో ఆ కార్యక్రమం పూర్తి అయ్యేది.

అందరూ ఎవరి దోవన వాళ్ళు వెళ్ళిపోయేవాళ్ళు.

సుబ్బాం కాఫీ తాగి ఈ కాఫీ దుకాణం సర్దటం ఓ పెద్దపని అంటూ గిన్నెలూ గ్లాసులూ పోగేసుకుని వెళ్ళిపోయేది.

అమ్మమ్మ మిగిలిన సరంజామా సద్దుకుంటూ ఉంటే తాతయ్య నెమ్మదిగా "మళ్ళీ రేప్పొద్దునే కాఫీ ప్రాప్తం. సాయంత్రం పూట కూడా ఆ టీ నీళ్ళు మానేసి, కమ్మగా కాఫీ పెడితే బావుంటుంది కదా అనేవారు."

"మీకు బాగానే ఉంటుంది. మళ్ళీ ఇంత తతంగం అంటే నా వల్ల కాదు. ఏదో మీకు ఇష్టం కదా అని ఈ కాఫీ పని నెత్తిన పెట్టుకున్నాను గానీ మా అత్తగారిలా చద్దెన్నం పెట్టి ఊరుకుంటే బాగుండేది" అనేది అమ్మమ్మ.

"మధ్యలో ఏ అతిధులో వస్తే కాఫీ పెడతావేమిటి? " అని ఆశగా అడిగేవారు తాతయ్య.

"అమ్మమ్మ మడి కట్టుకున్నాను ఇప్పుడు కాఫీ ఏమిటి?" అని నిమ్మరసమో మజ్జిగో ఇచ్చేది.

తాతయ్య ఉసూరుమనేవారు.

"అమృతంలా కాఫీ పెట్టే ఈ భాగ్యశాలి అడిగినప్పుడల్లా కాఫీ ఇస్తే ఎంత బాగుండేది!?రెండో ప్రపంచ యుద్ధం సమయంలో ఆహారానికి రేషన్‌లాగా మా ఇంట్లో కాఫీకి రేషన్" అని సణుక్కునేవారు తాతయ్య.

KOUMUDI

# కదంబం - పుణుకులూ

**మా ఊళ్ళో మా ఇంటిపక్కనే ఓ కుటుంబం ఉండేది.** ఆయన వృత్తి పౌరోహిత్యం. కొద్దిగా పొలం ఉండేది. ఏడుగురు ఆడపిల్లలు. ఒక్కడే మగపిల్లవాడు. మరో నలుగురు కొడుకులు పుడితే బాగుండునని అనుకునేవాళ్ళట. వాళ్ళది పూరిల్లు.. బీదరికంతో బాధపడుతూ ఉండేవాళ్ళు.

అందరూ చాలా మంచివాళ్ళు. వాళ్ళ తిప్పలు వాళ్ళు పడేవాళ్ళు. కానీ ఎదటివారిని యాచించి ఎరుగరు. ఆడపిల్లలు అందరూ చక్కని చుక్కలు. బారెడేసి జడలతో చూడముచ్చటగా ఉండేవాళ్ళు. పాపం లేమిలో ఉన్నారని అందరూ అంతో ఇంతో సాయం చేస్తూ ఉండేవారు సాయం అంటే డబ్బురూపంలో కాదు. అలా డబ్బు సాయం చేసే అవకాశం ఎవరికీ ఉండేది కాదు అప్పట్లో. పొలంలో పండిన కందుల్లో నాలుగు సేర్లు ఇవ్వటం. దొడ్లో పండిన కూరగాయలు ఇవ్వటం. చింతకాయలు ఇవ్వటం పాత చీరెలు ఇచ్చి లంగాలు కుట్టించుకోమనటం వంటి సాయం చేసేవాళ్ళు.

వాళ్ళతో నాకు మంచి స్నేహం. ముఖ్యంగా వాళ్ళ మూడో అమ్మాయి సీత నా తోటిదే

నా రాక కోసం ఎంతో ఆశతో ఎదురు చూసేవాళ్ళు. అందుకు చాలా కారణాలు ఉన్నాయి. నాకు మా నాన్నగారు పెద్ద డబ్బా నిండా చాక్లెట్లు కొని పెట్టేవారు. అవి వాళ్ళకి ఇస్తే ఎంతో అపురూపంగా తినేవాళ్ళు. మేము సిటీలో ఉండటం వాళ్ళ సినిమాలు అన్నీ చూసేవాళ్ళం.

KOUMUDI

సినిమా కథ చెప్పవా అని ఆశగా అడిగేవాళ్ళు. కథ ఆసాంతం చెప్తూ ఉంటే ఒళ్ళంతా చెవులు చేసుకుని వినేవాళ్ళు. రోజుకో కథ చొప్పున చెప్పించుకుని సినిమా చూసినంత ఆనంద పడేవాళ్ళు. మా ఇంటికి వచ్చి రేడియోలో పాటలు వినేవాళ్ళు. నేను కొత్తగా కొనుక్కున్న బట్టలూ, బొమ్మలూ మెరిసే కళ్ళతో చూసి ఆనందించేవాళ్ళు నేను ఊరికి వెళ్ళి తిరిగి వచ్చేస్తుంటే మళ్ళీ ఎప్పుడొస్తావు? అని దీనంగా అడిగేవాళ్ళు.

ఎప్పుడు ఊరికి వెళ్ళినా నాలుగైదు రోజులుండి వచ్చేసేవాళ్ళం. వేసవి సెలవుల్లో మాత్రం రెండు నెలలు ఉండేవాళ్ళం. అప్పుడైతే వాళ్ళకి పండగ. నాతో బాటుగా తాటి ముంజలు తినేవాళ్ళు. మజ్జిగ, నిమ్మకాయనీళ్ళు తాగేవాళ్ళు. మా ఇంట్లో పెద్ద నిమ్మచెట్టు ఉండేది. కాబట్టి నిమ్మకాయలకి కొరతలేదు. మంచినీళ్ళ బావికి వెళ్ళి బిందెతో నీళ్ళు తెచ్చేది వాళ్ళ రెండో అమ్మాయి సరస్వతి. మా ఇంటికే వచ్చేది బిందెతో. నిమ్మకాయలు కోసుకునేవాళ్ళం. ఉప్పు కుండ తులసి గట్టు మీదనే ఉండేది.

ఆ నీళ్ళు ఓ గిన్నెలో పోసి నిమ్మకాయలు బోలెడన్ని పిండి ఉప్పేసి కలిపి కడుపు నిండా తాగేవాళ్ళు. ఏదైనా తినాలనీ, తాగాలనీ వాళ్ళు పడే తాపత్రయం నాకు కూడా అనుభవమే.

మా ఇంట్లో దేనికీ కొరతలేదు. ఇంట్లో అన్నీ సమృద్ధిగా ఉండేవి. అయినా నేను తినాలనుకుని తినలేని పదార్ధం ఒకటి ఉంది.

మా ఊరి గుడి పక్క సందులో స్వామ్రాజ్యమ్మ అని ఒకావిడ పుణుకులు తయారు చేసి అమ్మేది. టెన్నీసు బంతి అంత ఉండేవి. అణాకి నాలుగు. ఒకసారి నా ఫ్రెండ్ సావిత్రి కొనుక్కుని నాకు ఓ చిన్న ముక్క పెట్టింది. భలే రుచిగా ఉంది. ఇంకో నాలుగు తినాలని అనిపించింది.

వెంటనే ఇంటికెళ్ళి అణా తెచ్చుకుని కొనుక్కుందామని పరుగున ఇంటికి వెళ్ళి డబ్బులిమ్మని అడిగాను. 'పుణుకులు కొనుక్కుంటాను' అన్నాను. 'ససేమిరా' అన్నారు అమ్మా, అమ్మమ్మా. అలా బయట కొనుక్కున్న వస్తువులు తినకూడదట. 'కావలిస్తే ఇంట్లోనే చేసిపెడతాం' అన్నారు. అలాగే చేసారుగానీ ఆ రుచి రాలేదు.

ప్రతిసారీ నేను గొడవ చెయ్యటం పెద్దవాళ్ళు వీల్లేదు అనటం. మొత్తానికి పుణుకులు కొనుక్కు తినాలన్న నా కోరిక కోరికగానే మిగిలిపోయింది.

ఒకరోజు మా ఇంట్లో కూచుని వేయించిన వేరుశెనక్కాయలు తింటున్నాం నేనూ సీత వాళ్ళ చెల్లెళ్ళూ 'నువ్వెంత అదృష్టవంతురాలివి ఎప్పుడూ ఇంట్లో తినుబండారాలూ ఉంటాయి' అన్నారు.

'ఆః.. నా మొహం ఏం అదృష్టం? పునుకులు కొనుక్కు తినే యోగం లేదుకదా! ' అన్నాను.

'అదేవిటీ? ' అని ఆశ్చర్యపోయి అడిగితే అంతా చెప్పేసాను.

'ఆ పుణుకులు అంత బావుంటాయా? ' అని అడిగారు.

'బాగుండటంలో కాస్తా ! అమృతంలా ఉంటాయి. వాటిముందు ఈ అరిసెలు, లడ్డూలు బలాదూరు. కానీ ఏం లాభం? ఆ పుణుకులు తినే అదృష్టం ఈ జన్మకు లేదు నాకు' అన్నాను.

వాళ్ళు జాలిపడ్డారు 'అయ్యో పాపం మేము కొనిపెడతాంలే' అన్నారు.

నాకు నవ్వొచ్చింది 'మీరెలా కొనిపెడతారు? మీ దగ్గర డబ్బులెక్కడున్నాయి? ' అన్నాను.

'డబ్బు సంపాదిస్తాం..' అన్నారు.

అలాగే సంపాదించారు వెంటనే కాదు ఏడాది తరువాత! ఎలాగంటే వర్షాకాలం వచ్చాక దొడ్లో కనకాంబరం మొక్కలూ మరువం మొక్కలూ నాటి నీళ్ళు పోసి సాకారు. వేసవికాలం వచ్చేసరికి అవి పెరిగి పెద్దవి బోలెడన్ని పూలు పూసాయి. అవి అన్నీ కోశారు. జనార్ధనరావు గారింట్లో చెట్టున కాసిన బత్తాయి కాయ ఒకటి అడిగి తీసుకున్నారు. ఆ కాయ జాగ్రత్తగా సగానికి కోసి రసం పిండి లోపలున్న పిప్పి అంతా తీసేసి ఆ దొప్పలతో త్రాసు తయారుచేసారు.

కనకాంబరాలు మరువం కొమ్మలూ తీసుకుని ఎండవేళ మా ఇంటికి వచ్చారు.

'అమ్మమ్మా పూలు కొంటారా?' అని అడిగారు. తాతయ్య కూడా అక్కడికి వచ్చారు.

'ఏవిటే పిల్లలూ ఏం పూలు? ' అంది అమ్మమ్మ. చిన్న బుట్టలో తడిబట్టలో చుట్టపెట్టిన పూలూ మరువం తీసారు.

ఆ పువ్వులూ ఆ బుజ్జిత్రాసు చూసి మురిసిపోయారు అందరూ.

'ఎంత? ' అని అడిగారు తాతయ్య.

KOUMUDI

'కనకాంబరాలు తులం అణా. మరువం అణాకి రెండు కట్టలు 'అని చెప్పారు. తాతయ్యగారినడిగి రూపాయి బిళ్ళ తీసుకుని ఆ త్రాసులో తూచారు.

'ఎండలో ఏం తిరుగుతారు, అన్నీ ఇక్కడే మాకే అమ్మేయ్యండి' అని అన్నీ తీసుకుని లెక్కగట్టి ఏడు అణాలు ఇచ్చారు. వాళ్ళ సంబరం అంబరం దాటింది.

'సాయంత్రం నాలుగింటికి నువ్వు స్కూల్ దగ్గరికిరా' అని నాకు రహస్యంగా చెప్పి వెళ్ళిపోయారు. మా ఇంటిని అనుకునే ఉంది స్కూల్. వేసవి సెలవులు కాబట్టి ఖాళీగానే ఉంది.

నాలుగింటికి స్కూల్లోకి వెళ్ళాను. వాళ్ళంతా వచ్చేశారు. అందరికీ ఆదుర్దా.. ఓ పక్క సంతోషం.

సీత ముగ్గురు చెల్లెళ్ళను వెంటబెట్టుకుని సామ్రాజ్యమ్మ దగ్గరకి వెళ్ళి ఏడు అణాలకి పుణుకులు ఇమ్మన్నారుట. ఆవిడకి అనుమానం వచ్చింది.

'ఎక్కడివి మీకు ఇన్ని డబ్బులు? ' అని అడిగిందట. మావే అన్నారుట వీళ్ళు. ఆవిడ నమ్మలేదు 'ఎక్కడినుంచీ వచ్చాయి పదండి మీ ఇంటికి' అని బయలుదేరింది. వద్దు అని మొత్తుకున్నారట వీళ్ళు. అయినా ఆవిడ వినలేదు. ముందు ఆవిడ వెనకాల. దారంతా ఏడుస్తూ వీళ్ళు. అందరూ ఇళ్ళల్లోంచి బయటికొచ్చారు. మా ఇంట్లో నుంచీ అందరూ వాకిట్లోకి వచ్చారు.

మా ప్లానంతా పాడయింది రహస్యం బట్ట బయలు అయింది. 'కరణం తాతయ్యగారింట్లో పూలు ఇచ్చి వస్తాం అని చెప్పి మీరు చేసిన నిర్వాకం ఇదా? తాతయ్యకి పూలు డబ్బులకి అమ్ముతారా? ఆ డబ్బులతో చిరుతిళ్ళు కొనుక్కు తింటారా?' అని వీళ్ళ అమ్మ తలా రెండూ బాదిందట.

'మా కోసం కాదు విజయ కోసం. తను మాకు ఎప్పుడూ అన్నీ ఇస్తుంది. కదా పాపం తనకి పుణుకులు కొనిపెడదాం అనుకున్నాం' అని అసలు విషయం చెప్పి ఏడిచారు.

ఆవిడ, మా అమ్మమ్మ ఏదో అనబోతూ ఉంటే తాతయ్య అందరినీ మందలించారు. 'ఇక చాలు ఊరుకోండి. చిన్న పిల్లలని మరీ అతిగా కట్టడి చెయ్యకూడదు. వాళ్ళకి ఏం పెద్ద కోరికలు ఉంటాయి? ఏ పీచు మిఠాయో నూజీడీలో కొనుక్కుతినాలని సరదాపడతారు వాళ్ళ సరదా కనిపెట్టి మనమే.. కాస్త పట్టు వదలాలి. ' అన్నారు.

మా వంక తిరిగి 'పిల్లలూ మీ డబ్బు మీరు దాచుకోండి. అది మీ కష్టార్జితం. నా మనవరాలికి పుణుకులు నేను కొనిపెడతాను దాంతో పాటు మీకు కూడా' అన్నారు.

మరికాసేపటికి మా ఇంట్లో పూసిన మల్లెలూ కనకాంబరాలు మరువం వేసి కట్టిన కదంబం తలలో పెట్టుకుని సామ్రాజ్యమ్మ చేసిన పుణుకులు తింటూ గంతులు వేశాం అందరం.

KOUMUDI